

రేపటి నుంచి సీఎం ఉత్తరాంధ్ర పర్యటన

- రెండో తేదీన విశాఖ కలెక్టరేట్‌లో సమీక్ష
- అభివృద్ధి పనులు, 100 రోజుల ప్రణాళికలపై నివేదికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచన

· 8లో

పేలుతున్న ధరలు

గడిచిన ఏడాదితో పోలిస్తే 20 నుంచి 25 శాతం మేర పెరిగిన బాణసంచా రేట్లు

- అమ్మకాలపై ప్రభావం
- 40 శాతం విక్రయాలు కూడా జరగలేదని వ్యాపారుల ఆందోళన
- పండుగరోజు కొనుగోళ్లపైనే ఆశలు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా ధరలు గడిచిన ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 20 నుంచి 25 శాతం మేర పెరిగాయి. ఆ ప్రభావం విక్రయాలపై పడినట్టు వ్యాపారులు చెబుతున్నారు. నగర పరిధిలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రౌండ్, ఎం.వి.పి.కాలనీలోని ఆల్వార్‌దాస్ మైదానంతోపాటు మధురవాడ, ఎన్ఏడీ, గాజువాక వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా బాణాసంచా స్టాళ్లు ఏర్పాటుచేశారు. అయితే రానురాను మందుగుండు సామగ్రి కొనుగోళ్లు తగ్గుతూ వస్తున్నాయి. గత ఏడాది మూడు వేలకుపైగా వెచ్చించి సామగ్రి కొనుగోలు చేసినవారు ఈ ఏడాది రెండు వేలకు మించి పెట్టడం లేదు. సాధారణంగా దీపావళి ముందురోజు సాయంత్రానికే సుమారు 60 శాతం మేర బాణాసంచా విక్రయాలు జరుగుతుంటాయి. కానీ, ఈ ఏడాది 40 శాతం కూడా కాలేదని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో పండుగ రోజు జరిగే విక్రయాలపైనే వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. కొంతమంది వ్యాపారులు 50, 60, 70 శాతం డిస్కౌంట్ అంటూ దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటుచేశారు. ఈసారి చిన్నారులకు సంబంధించిన వస్తువులు ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ఫ్యామిలీ ప్యాక్ ధరలు వేయి నుంచి రూ.పది వేలు వరకు ఉండగా, చిల్డ్రన్ ప్యాక్ ధర రూ.700 నుంచి రూ.5 వేల వరకు ధరల్లో ఉన్నాయి.



ఏయూ మైదానంలో ఏర్పాటుచేసిన స్టాల్‌లో కొనుగోళ్లు

వస్తువు	గత ఏడాది ధర	ఈ ఏడాది
చిచ్చుబుడ్లు బాక్స్ (పది)	రూ.300-700	రూ.500-1,200
1000 వాలా	650-700	800-1000
10000 వాలా	2,000-4,000	2,500-6,000
లక్ష్మీ బాంబులు బాక్స్ (పది)	750	800
కాకరపువ్వొత్తులు ప్యాకెట్	280	320
(10 బాక్స్‌లు)		
భూ చక్రాలు (బాక్స్ 10)	350	410
ఫ్లవర్ పాట్స్ (బాక్స్)	250	310
తాళ్లు (బాక్స్-10)	50	70
రాకెట్స్ స్మాల్	150	200
60 షాట్స్	1,300	1,500-1,600
120 షాట్స్	2,400	2,600-3,000
విష్ణు చక్రాలు బాక్స్	140	200
కిడ్స్ ప్యాక్	650	750-1,000
చిల్డ్రన్ ప్యాక్	650	700-900
యూత్ ప్యాక్	950	1,000-1,200
గోల్డ్ ప్యాక్	1050	1,150
యూనివర్సల్ ప్యాక్	2,050	2,300

ధరలు బాగా పెరిగాయి



ఈ ఏడాది దీపావళి సామగ్రి తక్కువగానే తీసుకున్నాం. ధరలు బాగా పెరిగాయి. గడిచిన ఏడాది రూ.5 వేలు వస్తు వులు కొనుగోలు చేశాం. ఈ ఏడాది రూ.3 వేలు మాత్రమే వెచ్చించాం. అది కూడా పిల్లలకు సంబంధించిన వస్తువులే ఎక్కువగా తీసుకున్నాం. 24 రకాల వస్తువులు వచ్చాయి. ఇందులో దాదాపు 19 రకాలు పిల్లలకు సంబంధించినవే ఉన్నాయి. ఏటా ధరలు పెరగడం కొంతవరకు ఇబ్బందిగా ఉంటోంది. - డాక్టర్ కేఏ కుమారి, సీతమ్మధార

పడకేసిన పర్యాటక శాఖ

ప్రచారం ఊసే లేదు

- నగరాన్ని సందర్శించే పర్యాటకులకు వసతి కల్పించే దిక్కు లేదు
- కనీసం వాహనాలు కూడా సమకూర్చలేని దుస్థితి
- పాత బస్సులు...మరమ్మతులకు లభించని అనుమతులు
- మార్కెటింగ్ లేక టూర్లు నిల్



టూర్లు లేకపోవడంతో ఖాళీగా ఉన్న పర్యాటక శాఖ వాహనాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఊరందరిదీ ఒక దారి...ఉలిపికట్టెది మరో దారి అన్నట్టుగా ఉంది ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ తీరు. పర్యాటకులను ఏ విధంగా ఆకట్టుకోవాలా అని ఆతిథ్య రంగంలోని సంస్థలు తెగ యత్నిస్తుంటే...ఏపీటీడీసీ మాత్రం చేష్టలుడిగి చూస్తోంది. ఇది పర్యాటక సీజన్. దసరా మొదలుకొని సంక్రాంతి వరకు విశాఖపట్నం జిల్లాకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తారు. వారి కోసం హోటళ్లు, ట్రావెల్ సంస్థలు రకరకాల ప్యాకేజీలు అందుబాటులో ఉంచాయి. కొందరైతే రెండు అడుగులు ముందుకు వేసి పర్యాటకుల కోసం కార్వాన్‌లు కూడా నడుపుతున్నారు. ఏపీటీడీసీ మాత్రం పాతబడిన బస్సులకు కనీసం మరమ్మతులు కూడా చేయించుకోలేకపోతోంది.

విశాఖ జిల్లాలో పర్యాటక శాఖ ప్రచారం చాలా తక్కువ. ఎక్కడెక్కడికి టూర్లు నడుపుతున్నారో, వారి దగ్గర అందుబాటులో ఉన్న సౌకర్యాలు ఏమిటో ఎవరికీ చెప్పరు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లలో తప్ప ఇంకెక్కడా సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇక వసతి విషయానికి వస్తే...గత ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్ల రుషికొండపై హరిత రిసార్ట్స్ లేకుండా పోయాయి. అప్పుఘర్ వద్ద ఉన్న యాత్రీనివాస్‌కు ఆధునీకీకరణ పేరుతో రెండేళ్ల నుంచి బుకింగ్‌లు ఆపేశారు. ఇప్పుడు విశాఖలో పర్యాటకులకు పర్యాటక శాఖ తరఫున ఒక గది కూడా అందుబాటులో లేదు. పోనీ వారి వాహనాల్లో పర్యాటక ప్రాంతాలకు వెళదామని అనుకున్నా అనుకూల వాతావరణం లేదు. ఏపీటీడీసీ వద్ద రెండు ఇన్నోవా కార్లు, 18 సీట్ల సామర్థ్యం కలిగిన మినీ బస్సులు మూడు, 36 సీట్ల సామర్థ్యం కలిగిన బస్సులు నాలుగు ఉన్నాయి. అందులో రెండు బస్సులు మరమ్మతులతో మూలకు చేరాయి. బాగు చేయిస్తామని అమరావతికి ప్రతిపాదనలు పంపితే ఆమోదం రాలేదు. ఇక మిగిలిన వాటినైనా నడుపుతున్నారా?...అంటే అదీ లేదు. ఎక్కడెక్కడికి టూర్లు ఉన్నాయో అసలు ప్రచారం చేయడం లేదు.

ప్రైవేటుతో పోటీ పడలేక...

విశాఖలో పర్యాటకుల కోసం ప్రైవేటు వ్యక్తులు వందల సంఖ్యలో వాహనాలు నడుపుతున్నారు. కానీ ఏపీటీడీసీ ఉన్న రెండు ఇన్నోవా కార్లను, నాలుగు బస్సులను నడపలేకపోతోంది. ఇన్నోవాను ఏపీటీడీసీ వద్ద అద్దెకు తీసుకుంటే కిలోమీటరుకు రూ.18 వసూలు చేస్తున్నారు. దానిపై మళ్లీ జీఎస్టీ అదనం. అదే ప్రైవేటు ట్రావెల్స్ అయితే బేరం ఆడుకుంటే కిలోమీటరుకు రూ.15కే వస్తున్నారు. వారి దగ్గర జీఎస్టీ ఉండదు. అక్కడే తక్కువ రేటుకు రావడం వల్ల ఎక్కువ మంది అటు వెళుతున్నారు. పోనీ బస్సులు చూస్తే...ఒక్క దానికి కూడా ఏసీ లేదు. ఇప్పుడు పర్యాటకులంతా ఏసీ వాహనాలనే కోరుకుంటున్నారు. దానిని ప్రభుత్వం గుర్తించడం లేదు. పైగా పాత బస్సులు కావడంతో సీట్లు చిరిగిపోయి...ఆకర్షణీయంగా ఉండడం లేదు.

ఏపీటీడీసీ చైర్మన్ క్లాస్

ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ ఇటీవల విశాఖలో పర్యటించారు. ఈ సందర్భంగా సాగర్‌నగర్ ఏరియాలో ఏపీటీడీసీ వాహనాలను పరిశీలించారు. బాగా డిమాండ్ ఉన్న సీజన్‌లోనే వాహనాలన్నీ ఖాళీగా పార్కింగ్‌లో ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. మార్కెటింగ్ ద్వారా ప్రైవేటు ఆపరేటర్లతో పోటీ పడి టూర్లు వేయాల్సి ఉండగా, పట్టనట్టు ఉండడం సరికాదని అధికారులకు క్లాస్ తీసుకున్నారు. వాహనాలు కూడా ఆకర్షణీయంగా లేవని, ఇలాగైతే సంస్థ పరువుపోతుందన్నారు. మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు.

అపార్ నమోదుకు అవస్థలు

విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లలో తప్పులతో ఇబ్బందులు

- 9, 10 తరగతుల విద్యార్థుల్లో 50 శాతం నమోదు
- ప్రైమరీ, యూపీ పాఠశాలల్లో మందకొడిగా ప్రక్రియ

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):

ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి విద్యార్థికీ గుర్తింపుకార్డు జారీ కోసం చేపట్టిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)కి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థి పుట్టిన తేదీ, పేరు, తల్లిదండ్రుల పేర్లలో తప్పులు (స్పెల్లింగ్ మిస్టేక్స్) ఉండడంతో రిజిస్ట్రేషన్‌కు సమస్యలు ఎదురవుతున్నాయి. తల్లిదండ్రులు సహకరించినచోట కొంతవరకు నమోదు ప్రక్రియ ముందుకు సాగుతుండగా, మిగిలిన చోట్ల గంటల తరబడి కుస్తీ పట్టాల్సి వస్తోంది. ఆధార్ కార్డులో సవరణ కోసం కేంద్రాలు అందుబాటులో లేకపోవడం టీచర్లకు పరీక్షగా మారింది.

ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు ఐడీ నంబరుతో ఒక కార్డు జారీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీనికి అపార్ అని పేరు పెట్టారు. డిజిటలైజేషన్, పర్సనలైజ్‌డ్ లెర్నింగ్, చదువుకు దూరంగా ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలలకు తీసుకువచ్చేందుకు 'అపార్' దోహదపడుతుందని భావిస్తోంది. అయితే అపార్‌లో



విద్యార్థుల వివరాలు నమోదు చేసేందుకు టీచర్లు తంటాలు పడుతున్నారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లలో తేడా ఉంటే రిజిస్ట్రేషన్ కావడం లేదు. పాఠశాల రికార్డు, ఆధార్ నంబర్లలో వివరాలు ఒకేలా ఉండాలి. లేకపోతే రిజిస్ట్రేషన్‌కు ఇబ్బంది ఎదురవుతోంది. ఆధార్‌లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుంది. పుట్టిన తేదీని పాఠశాల రికార్డు లేదా పంచాయతీ సెక్రటరీ, ఆస్పత్రి రికార్డుల ఆధారంగా సవరిస్తున్నారు. దీంతో ఆ సర్టిఫికెట్ల కోసం తల్లిదండ్రులు సచివాలయాలను సంప్రతిస్తున్నారు. ఇదిలావుండగా ఆధార్ కార్డులో సవరణకు ఉన్నత పాఠశాలల్లో క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. జిల్లాలో 3,44,254 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 9,10 తరగతులకు సంబంధించి 75,110 మందికిగాను 38,072 మంది వివరాలు అపార్‌లో రిజిస్ట్రేషన్ చేయించారు. కానీ ప్రాథమిక పాఠశాలల్లో 1,56,672 మందికిగాను 7,962, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1,12,472 మందికిగాను 9,170 మంది వివరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయగలిగారు. ఆధార్ నంబర్‌లో సవరణలకు క్యాంపులు నిర్వహించడం, పుట్టిన తేదీ సర్టిఫికెట్ల జారీని వేగవంతం చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందని టీచర్లు అభిప్రాయపడుతున్నారు.

యాంటీ నార్కోటిక్స్‌పై పోలీస్ అధికారుల సమావేశం

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లింగ్‌ను ఎదుర్కొనేందుకు ఏపీ, ఒడిశా రాష్ట్రాల పోలీస్ శాఖలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్) ఆధ్వర్యంలో బుధవారం వర్చువల్‌గా జరిగిన సమావేశంలో ఏపీ, ఒడిశా రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సరిహద్దు జిల్లాల ఎస్పీల మధ్య సమాచార మార్పిడి, అంతర్ జిల్లాల చెక్‌పోస్టుల ఏర్పాటు, గంజాయి పండించే ప్రదేశాల గుర్తింపు తదితర అంశాలపై చర్చించారు.









అప్పన్న సేవలకు నూతన ఇత్తడి సామగ్రి

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి మూడు పూటలా నివేదనకు అవసరమైన ప్రసాదాల తయారీలో వినియోగించడానికి నూతన ఇత్తడి సామగ్రి కోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయ పోటులో గత కొన్నేళ్లుగా వినియోగించిన పాత ఇత్తడి గిన్నెల్లో కొన్ని చిల్లులు పడి నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని కాకినాడకు చెందిన కాంట్రాక్టర్‌తో కరిగించి, కొత్తగా సామగ్రి తయారు చేయించి పునర్వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు పాత సామగ్రి సుమారు 335 కిలోల ఇత్తడిని కాంట్రాక్టర్‌కు బుధవారం అప్పగించారు.

5వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సెల్ ఫోన్‌లో సభ్యత్వ నమోదును చూపిస్తున్న నాయకులు

కొమ్మాది, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వ నమోదులో నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందుండేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. బుధవారం వార్డు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, మన్యాల సొంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో 127 అభ్యంతరాల స్వీకరణ

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడలో బుధవారం నిర్వహించిన రీసర్వే గ్రామసభలో రైతులు 127 అభ్యంతరాలను తెలియజేశారు. సర్పంచ్ రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రీసర్వే డీటీ బి.లక్ష్మి, మండల సర్వేయర్ రమేశ్, వీఆర్ఓ ప్రసాద్, గ్రామ సర్వేయర్ అప్పలరెడ్డి, రత్న పాల్గొన్నారు.

పద్మనాభం : జానకీదేవిపురంలో జరిగిన రీసర్వే గ్రామ సభలో అయిదు దరఖాస్తులు వచ్చాయి. వీటిలో పేరు మార్పునకు మూడు, విస్తీర్ణంలో తేడాల సవరణకు రెండు దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె. ఆనందరావు, డీటీలు చంద్రశేఖర్, వరలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన అనంత పద్మనాభుని పవిత్రోత్సవాలు



విశేష అలంకరణలో కుంతీమాధవస్వామి

పద్మనాభం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని క్షేత్రంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిశాయి. తొలుత పండితులు వేద మంత్రోచ్చారణలతో స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేసి నిత్య హోమాలు, పూర్ణాహుతి నిర్వహించి, స్వామివార్లకు అలంకరించిన పవిత్ర విసర్జన చేశారు. అనంతరం కుంతీమాధవస్వామి మూలవిరాట్టుతో పాటు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవితో కూడిన అనంతుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై నిలిపి, సంప్రదాయబద్ధంగా శాంతి కల్యాణం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ మాజీ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. ఎంపీటీసీ సభ్యురాలు కె. లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు వారికి అనంతుని చిత్రపటం బహూకరించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కె. లక్ష్మణరావు, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు రామస్వామినాయుడు, కమిటీ సభ్యులు పైడిరాజు, సన్యాసిరావు, పద్మ, మహేశ్ పాల్గొన్నారు.



భీమిలిలో నరకాసుర వధ



భీమునిపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాలయం వీధిలో బుధవారం రాత్రి నరక చతుర్థశి సందర్భంగా నరకాసుర వధ జరిగింది. డాక్టర్ ముమ్మిడిశెట్టి ఆదిత్య, పురోహితులు సుసరావు కామేశ్వర మాధవశాస్త్రిపులపా రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు నరకాసుర వధ ప్రాశస్త్యాన్ని వివరించారు. నరకాసుర వధను ప్రజలు ఆనందంగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు ముమ్మిడిశెట్టి సత్యానందరావు, ద్రోణంరాజు రాఘవరావు మాస్టారు, అల్లం రామకృష్ణ, ఎంవీఎల్ కామేశ్వరరావు, కట్టమూరి రమణారావు, కందుల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.





'విలువలతో కూడిన విద్య అవసరం'



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

భీమునిపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మంజుల ఆకాంక్షించారు. బుధవారం ఆ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు శిర్లపాలెం బాలికల ఎంపిక

ఆనందపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఏయూ వైద్య కళాశాలలో బుధవారం జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన రేగాని హర్షిణి 600 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానం సాధించగా, శృతిక 400 మీటర్ల విభాగంలో మొదటి స్థానం పొందింది. అలాగే 100, 200 మీటర్ల విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించారు. ఈమేరకు నిర్వాహకులు వారిని ఏలూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారు. బాలికలను హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు అభినందించారు.







కృష్ణాపురంలో 'పొలం పిలుస్తోంది'

పద్మనాభం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రబీలో రైతులు మొక్కజొన్నతో పాటు రాగులు పండించాలని భీమిలి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ బి. విజయప్రసాద్ చెప్పారు. బుధవారం కృష్ణాపురం, సుంకరిపేట గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లా డారు. రాగుల విత్తనాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, మినుము, పెసర తదితర విత్తనాలు కూడా త్వరలోనే వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీ సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఏఓ చలం, మార్కెటింగ్ అధికారి మేరీకుమారి, పశువైద్యాధికారి మహేశ్, పాల్గొన్నారు.

బీచ్ ఫొటో గ్రాఫర్లకు టీ షర్టులు పంపిణీ

భీమునిపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 70 మంది బీచ్ ఫొటో గ్రాఫర్లకు సెంటీనియల్ లయన్స్ క్లబ్, సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సభ్యులు టీ షర్టులు, రెండు లైఫ్ జాకెట్లు చొప్పున పంపిణీ చేశారు.బుధవారం సాయంత్రం గుప్తావీధిలోని సాయి సదనంలో జరిగిన ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్టు గవర్నర్ ప్రసాద్, జడ్జీ ప్రసన్నవాణి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కోట మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంటీనియల్ లయన్స్ క్లబ్ సభ్యురాలు కోట పద్మారాణి, కేఎస్ఎన్ మూర్తి, ఎ. అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.







కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజమున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, కల్యాణ క్రతువు జరిపారు.

మంత్రి కొల్లు దృష్టికి పంచ గ్రామాల భూ సమస్య

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూ సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలుగు యువత అధికార ప్రతినిధి శంకరరావు తెలిపారు. నగరంలో మంత్రి నిర్వహించిన ప్రజా దర్బారులో వినతిపత్రం ఇచ్చామన్నారు.



అప్పన్న హుండీల ఆదాయం రూ.1.7 కోట్లు

సింహాచలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కట్నా, కానుకల ద్వారా రూ. 1.7 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు పర్యవేక్షణలో దేవదాయశాఖ ప్రత్యేక అధికారి బండారు ప్రసాద్ నేతృత్వంలో బుధవారం సింహగిరిపై ఉన్న పరకామణి కేంద్రంలో హుండీల లెక్కింపు చేపట్టారు. హుండీల ద్వారా గత 30 రోజులకుగాను రూ.1,70,22,443 నగదు లభించగా అందులో రూ.6.85 లక్షలు చిల్లర నాణేల రూపంలో వచ్చింది. నగదుతో పాటు హుండీల్లో 57.9 గ్రాముల స్వర్ణం, 10 కిలోల 130 గ్రాముల 500 మిల్లీ గ్రాముల రజితం ఆభరణాల రూపంలో సమకూరింది. అలాగే యూఎస్ఏకు చెందిన 25 డాలర్లు, ఆస్ట్రేలియాకు చెందిన 70 డాలర్లు, సింగపూర్‌కు చెందిన 11 డాలర్లు, స్కాట్‌లాండ్‌కు చెందిన 20 పౌండ్లు,యూఏఈకి చెందిన 60 దీరమ్స్, నేపాల్‌కు చెందిన 20 రుపీస్, ఒమన్‌కు చెందిన 200 బియాస్, భూటాన్, ఖతార్, నైజీరియా, ఇండోనేషియా తదితర దేశాలకు చెందిన కరెన్సీ కూడా స్వామివారి ఖజానాకు హుండీల ద్వారా వచ్చింది. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు డిజి శ్రీనివాసరాజు, బి. రాంబాబు, పలు విభాగాల ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.


హుండీల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ త్రినాథరావు

గృహ నిర్మాణ శాఖ మాజీ ఉద్యోగిపై ఫిర్యాదు

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేదలకు ఇళ్లు ఇప్పిస్తానని చెప్పి, డబ్బులు వసూలు చేసిన టంకల ధనుంజయ్‌నాయుడుపై గృహ నిర్మాణ శాఖాధికారులు భీమిలి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ధనుంజయ్‌నాయుడు గతంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో గృహ నిర్మాణ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసేవాడు. అతని ప్రవర్తన బాగాలేకపోవడంతో అయిదు నెలలు క్రితం అధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటి నుంచి గ్రామాల్లో తిరుగుతూ ప్రజల్ని, రాజకీయ నాయకుల్ని మభ్యపెడుతూ ఇళ్లు మంజూరు చేస్తానని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్టు అధికారుల దృష్టికి వచ్చింది. కొంతమంది ప్రజాప్రతినిధులకు అతని గురించి తెలియక వారే మధ్యవర్తులుగా ఉండి డబ్బులు ఇప్పించారు. ఈమేరకు గృహ నిర్మాణ శాఖాధికారులు ధనుంజయ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

కొమ్మాది, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో కేజీ హెచ్ వైద్యుడు సి. చంద్రబాబు, బెటాలియన్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ మణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదని చెప్పారు. 120 మంది బెటాలియన్ సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే బెటాలియన్ నుంచి బక్కన్నపాలెం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సత్యం, ఇలియాసాగర్, నారాయణ, పాల్గొన్నారు.


విద్యార్థికి సర్టిఫికెట్ ఇస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ


భీమిలిలో అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న రవితేజ

ఘనంగా గంటా రవితేజ జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ జన్మదిన వేడుకలు బుధవారం బీచ్ రోడ్‌లో వున్న పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. 4వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు, యువ నాయకుడు త్రినాథ్‌కుమార్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొలగాని నరేంద్రకుమార్, అమటపు శ్రీకాంత్ గజమాలలతో ఆయన్ను సత్క రించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన 80 కిలోల కేక్‌ను కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, పాసి నరసింగరావు, గాడు అప్పలనాయుడు, కొప్పల రమేశ్, దంతులూరి అప్పలనరసింహరాజు, పాసి త్రినాథ్ కుమార్, గరికిన కింగ్, గాడు వెంకటప్పడు, మొల్లి లక్ష్మణరావు, చెట్టుపల్లి గోపీ, గంట్రెడ్డి స్వామినాయుడు, తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, కశిరెడ్డి దామోదరరావు, బీఆర్‌బీ నాయుడు, ఆవాల సూరిబాబు, మన్యాల సోంబాబు, కాళ్ల నగేశ్, లొడగల అప్పారావు, యరబాల అనిల్ ప్రసాద్, సోడిపిల్లి నారాయణరావు, శాఖరి శ్రీనివాస్, కంటుభుక్త రామానాయుడు, జీవన్‌కుమార్, సత్య పాల్గొన్నారు. అలాగే జడ్పీ ప్రసన్న వాణి, తహసీల్దార్ కూడా రవితేజకు శుభాకాంక్షలు తెలిపారు. ఎండాడ :జీవీఎంసీ 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపీ ఆధ్వర్యంలోనూ రవితేజ జన్మదిన వేడుకలు జరిగాయి. నాయకులు రవితేజను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు తెలుగు యువత అధ్యక్షుడు ఒమ్మి బాబూరావు, పరమేశ్వరరావు, దొరబాబు పాల్గొన్నారు.


రవితేజకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం

బురుజుపేట, విశాఖపట్నం. ఫోన్ నెం.0891-2568645, 2566515
ఆర్.సి.నెం.ఇ/909/2024, తేది.30-10-2024

మార్గశిరమాసం ఉత్సవ ప్రత్యేక పనులు & మెయింటెనెన్స్ - 2024 మరియు ఇతర పనులు

షార్ట్ టెండర్ / సీల్డ్ కొటేషన్ ప్రకటన

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మార్గశిరమాసోత్సవములు - 2024 సందర్భంగా ఈ క్రింది పనులకు సీల్డ్ టెండర్లు/కొటేషన్లు పిలువబడినవి.

క్ర. సం.	పని వివరములు షెడ్యూల్ ఫార్మ్‌లో తెలిపిన విధముగా	ధరావత్తు	టెండర్ షెడ్యూలు ఖరీదు	పని పూర్తి చేయుకాలం & నిర్వహణ	అర్హత
1.	ఎ. భక్తులకు 30 రోజులు భోజనం మరియు అల్పాహారం, ఏర్పాటు చేయుటకు (వంట పాత్రలు, వడ్డన సామాగ్రితో సహా). బి. మహా అన్నదానం తయారు చేయుటకు షెడ్యూల్‌లో తెలిపిన ప్రకారం	10,000/-	3,000/-	30 రోజులు	అనుభవం గల గుర్తింపు గల సంస్థ
2.	దేవస్థానం అవసర నిమిత్తం ఎలక్ట్రికల్ సామాగ్రి సప్లయి చేయుటకు షెడ్యూల్‌లో తెలిపిన ప్రకారం	5,000/-	1,000/-	1 సంవత్సరం కాలమునకు	దేవస్థానముల యందు మరియు కేటరింగ్ నిర్వహణ యందు అనుభవం గలవారు
3.	వివిధ పనులకు గాను మ్యాన్ పవర్ సప్లయి చేయుట షెడ్యూల్‌లో తెలిపిన ప్రకారం	3,000/-	500/-	30 రోజులు	గుర్తింపు గల సంస్థ

గమనిక : పై వ.నెం.1 నుండి 3 వరకు గల టెండర్ సప్లయి షెడ్యూల్ నందు తెలిపిన ప్రకారం

నిబంధనలు: 1. టెండర్ షెడ్యూల్ కొరకు దరఖాస్తు తేది.05-11-2024 సాయంత్రం 5.00 గం.ల వరకు స్వీకరించబడును. 2. తేది.11-11-2024, ఉ॥ 10.00 గంటల నుండి మ.2.00 గంటల వరకు సీల్డ్ టెండర్లు, టెండర్ బాక్సులో వేయవలెను. 3. అదే రోజు మధ్యాహ్నం 4.00 గంటలకు టెండర్లు తెరవబడును. 4. పై పనులను రద్దు చేయుటకు మరియు ఆమోదించుటకు గాను శ్రీ యుత కార్యనిర్వహణాధికారి వారికి పూర్తి అధికారము కలదు. 5. ఇతర వివరములకు దేవస్థానము కార్యాలయము పనిచేయు వేళలలో సంప్రదించవలెను. ఫోన్ నెం. 0891-2731250, 7075099449, 9704778288.

శ్రీమతి కె. శోభారాణి
ఉప కమీషనరు & కార్యనిర్వహణాధికారి

'డైట్'లో జాతీయ ఐక్యతా దినోత్సవం

భీమునిపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారత దేశం ఐక్యమత్యంతోనే స్వరాజ్యాన్ని సాధించిందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి అన్నారు.బుధవారం కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా ఐక్యతతోనే ప్రగతి సాధించగలమని చెప్పారు. దీనికి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జీవితమే నిదర్శనమని తెలిపారు.

In the Honourable Court of the VII Addl. Senior Civil Judge at Visakhaptanam
O.S. 356/2023

Between :
Smt. Chilakapati Siva Rani ...Plaintiff
And
Sri karri Lakshminarayana Reddy & 2 others ...Defendants

SUMMONS

To,
D-1: **Sri Karri Lakshminarayana Reddy,** S/o. Kondareddy, Hindu, aged about 45 years, R/at Plot No.25, D.No.2-1, Near Lakshminarayana Swamy Temple, Adarshnagar, Visakhapatnam-41.
D-3: **Sri Karri Samudra Reddy,** S/o. Rammurthy Reddy, Hindu, aged about 49 years, R/at Plot N0. 131, D.No.12-89, Ganesh Colony, Narasimhanagar, Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the matter stands posted to **21-11-2024** for your appearance on that day **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte.

(By Order of the Hon'ble Court)
N.V. SUMAN, Advocate,
Visakhapatnam. Cell: 9440041877

In the Honourable Court of the VII Addl. Senior Civil Judge at Visakhaptanam
I.A. 830/2023 & I.A.831/2023 in O.S.356/2023

Between :
Smt. Chilakapati Siva Rani ...Petitioner/Plaintiff
And
Sri karri Lakshminarayana Reddy & 2 others ...Respondents/Defendants

NOTICE

To,
R-1: **Sri Karri Lakshminarayana Reddy,** S/o. Kondareddy, Hindu, aged about 45 years, R/at Plot No.25, D.No.2-1, Near Lakshminarayana Swamy Temple, Adarshnagar, Visakhapatnam-41.
R-3: **Sri Karri Samudra Reddy,** S/o. Rammurthy Reddy, Hindu, aged about 49 years, R/at Plot N0. 131, D.No.12-89, Ganesh Colony, Narasimhanagar, Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above petitions against you and the matter stands posted to **21-11-2024** for your appearance on that day **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte.

(By Order of the Hon'ble Court)
N.V. SUMAN, Advocate,
Visakhapatnam. Cell: 9440041877



విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా

తగరపువలస, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. సీపీఐ నాయకులు చిట్టివలస సబ్ స్టేషన్ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచడం వల్ల ఆ ప్రభావం ఇతర రంగాలపై పడి సామాన్యులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పందించాలని కోరారు. అనంతరం సబ్ స్టేషన్ సహాయ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కానూరి రాంబాబు, అల్లు బాబూరావు, మొర ఆదినారాయణ, ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, అల్లం గోవింద్, నూలు ఆది నారాయణ, రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో..

మధురవాడ : రాష్ట్ర ప్రజల్లో కొందరికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్న ప్రభుత్వం మరోవైపు రూ. 6078 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ళ పైడిరాజు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మధురవాడ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రజలపై భారం పడేలా విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని గాలికి వదిలేశారని విమర్శించారు. జిల్లాలో సుమారు 25 లక్షల మంది వినియోగదారులు ఉన్నారని, వచ్చే నెల నుంచి వారిపై అదనంగా రూ. 15 కోట్ల భారం పడనుందని తెలిపారు. అనంతరం జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు.



మధురవాడ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

2న ఇస్కాన్‌లో గోవర్ధన పూజా మహోత్సవం

సాగర్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇస్కాన్ సాగర్‌నగర్ మందిరంలో వచ్చేనెల 2న గోవర్ధన పూజా మహోత్సవం నిర్వహించనున్నట్టు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాసు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవంలో భాగంగా ఆ రోజు గోవర్ధన పర్వతాన్ని తలపించే విధంగా అన్నం, పలు రకాల స్వీట్లు, పలుకులు, పండ్లతో అన్నకూట్ ఏర్పాటు చేసి, స్వామివారిని ఆరాదిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలు కీర్తనలతో పాటు గిరిరాజుకు పంచామృత అభిషేకం, హారతులు ఇస్తామన్నారు. అనంతరం అలాగే 1008 రకాల భోగాలను గిరిరాజుకు సమర్పించి, భక్తులు పంపిణీ చేస్తామని తెలిపారు.





పార్కును ఆధునికీకరించాలని ఎమ్మెల్యే వెలగపూడికి వినతి

విశాలాక్షినగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పార్కును ఆధునికీకరించాలని విశాలాక్షినగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కోరారు. బుధవారం వారు ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కైలాసగిరి కూడలి సమీపంలో ఉన్న రెవెన్యూ పార్కు నిర్వహణ లోపం వల్ల అధ్వానంగా ఉందని, పార్కును పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలన్నారు. అలాగే స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, కార్యవర్గ సభ్యులు వి. సింహాద్రిరావు, డి. శ్రీనివాసరావు, సీఎల్ఎస్ రాజు, పి. పరమేశ్వరరావు, జీవీ శాస్త్రి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు



తగరపువలసలో పాదుపు దినోత్సవం ర్యాలీ

తగరపువలస, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పొదపు దినోత్సవం పురస్కరించుకుని బుధవారం తగరపువలస సమీపంలోని బంగ్లామెట్ట ప్రాంతంలో జీవీఎంపీ ప్రాథమిక విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అప్పలరాజు, బుగత మల్లిక, సంజీవి పాల్గొన్నారు.











రేపటి నుంచి సీఎం ఉత్తరాంధ్ర పర్యటన

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రెండు రోజుల పర్యటన కోసం నవంబరు ఒకటో తేదీన విశాఖ రానున్నారు. ఆయన శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నం చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లాకు వెళ్లి అక్కడ ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం శ్రీకాకుళం చేరుకుని రాత్రి బస చేస్తారు. నవంబరు రెండో తేదీ ఉదయం విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గంలో పర్యటించి, అక్కడ నుంచి హెలికాప్టర్‌లో నగరానికి వస్తారు. జిల్లా అభివృద్ధిపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తారు. సీఎం పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ విడుదల కావలసి ఉంది. జిల్లాలో అభివృద్ధి ప్రాజెక్టులు, 100 రోజుల ప్రణాళికపై ఈనెల రెండో తేదీన ముఖ్యమంత్రి సమీక్షిస్తారని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, ఇప్పటివరకూ చేపట్టిన అభివృద్ధి పనులు, 100 రోజుల ప్రణాళికలో చోటు కల్పించిన అంశాలు, ప్రగతి నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తమ తమ శాఖలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో రావలసిన అనుమతులు, నిర్ణయాలు పెండింగ్‌లో ఉంటే చెప్పాలన్నా రు. సమీక్షలో డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, సీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

కొమ్మాది, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు ఎన్నటికీ మరచిపోలేనని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ అన్నారు. బుధవారం ఆయన జన్మదినోత్సవం సందర్భంగా విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో పీఎంపాలెంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. అనంతరం గురునాథ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, అయ్యప్ప భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.











మద్యం దుకాణం మార్పు నిర్ణయంతో మహిళల హర్షం

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నౌరోజీ రోడ్డు పందిమెట్ట జంక్షన్ వద్ద మద్యం దుకాణం ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతంలో మద్యం దుకాణం వద్దంటూ మహిళలు పది రోజులపాటు ఆందోళన నిర్వహించారు. అక్కడే వంటావార్పు చేసి నిరసన తెలిపారు. దీంతో నిర్వాహకులు వెనక్కి తగ్గారు. జనసేన నాయకుడు నెక్కళ్ళ త్రినాథ్ నాయకత్వంలో శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి తమ అభిమతాన్ని గౌరవించినందుకు, మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా తగిన సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగితపు మణి, బోరా శ్రీను, బహ్మస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేసిన వారిపై చర్యలేవీ?

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఆర్ జిల్లా రంపచోడవరం మండలం లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు, రాత్రి కాపలాదారుపై మద్యం తాగి వచ్చిన వ్యక్తి దుర్భాషలాడుతూ ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయటానికి ప్రయత్నించడాన్ని జిల్లా నర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు గంగాభవానీ ఖండించారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పాడేరు జిల్లా వైద్యాధికారిని కోరారు. నిందితుడిపై చర్యలు తీసుకొనే వరకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

విజ్ఞానంతో చేసే పండుగ దీపావళి

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానంతో చేసే పండుగ దీపావళి అని బ్రహ్మకుమారి రామేశ్వరి అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జీవితంలో అంధకారం తొలగించే దీపావళి కార్తీకమాస ఆరంభానికి శుభ సూచకమన్నారు. సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, నాగరాజు పట్నాయక్, సూరిబాబు, సిద్ధు, సునీత పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంచరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో ఆఖరి సెమిస్టర్ చదువుచున్న పదిమంది విద్యార్థులు 'ది ఆంధ్ర పెట్రోకెమికల్స్ లిమిటెడ్- విశాఖ' సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో వీరు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారికి బుధవారం కంపెనీ ప్రతినిధుల సమక్షంలో నియామక పత్రాలు అందజేశారు. కెమికల్ బ్రాంచి నుంచి ఐదుగురు, పెట్రో కెమికల్స్, ఆయిల్ టెక్నాలజీ, ప్లాస్టిక్&పాలిమర్స్ విభాగం నుంచి ఎంపికయ్యారు.వీరికి మొదటి ఏడాది రూ.2 లక్షలు, రెండో ఏడాది నుంచి రూ.4.8 లక్షల వేతనం ఇస్తారు. ఉద్యోగాలు పొందినవారిలో వి.జ్ఞానేశ్వరి, ఎం.దినేష్ కుమార్, కె.వెంకట త్రిలోచన,పి.భవానీశంకర్, డి.రవితేజ, ఎస్.భాగ్యకిరణ్, రాఘవేంద్ర, ఎం.లక్ష్మీప్రసాద్, ఎ.తేజ, కె.బాలాజీ ఉన్నారు. వీరిని ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు డా.బీవీ లక్ష్మణరావు, సీహెచ్.జయప్రకాశ్ రెడ్డి, దామోదర్, డా.ప్రశాంత కుమారి, సీహెచ్.వినోద్ కుమార్ తదితరులు అభినందించారు.

ఉత్సవ కమిటీ ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని 26వ వార్డు కూటమి అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, నాగడమూడి నానాజీ, బండి కనకరాజులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును బుధవారం వినతిపత్రంలో అభ్యర్థించారు. ఉత్సవ కమిటీ సభ్యుల వివరాలు అందజేశారు. రాబోయే రోజుల్లో దేవస్థానం కమిటీలో వీరే ఉండే విధంగా ప్రతిపాదించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సీతంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తనను పట్టించుకోవడం లేదంటూ మనోవేదన చెందిన మహిళ ఓ వృద్ధుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాటిచెట్లపాలెం చిన్నూరుకు చెందిన సుధాకర్ గుప్త (72), అక్కయ్యపాలెం రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక రోడ్డులో ఉన్న ఓ మహిళ (60) మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. ఆమె తీవ్రమైన వ్యాధికి చికిత్స పొందింది. ఈ సమయంలో సుధాకర్ గుప్త తనను పట్టించుకోవడంలేదని కక్షకట్టింది. పథకం ప్రకారం నీళ్ల సీసాలో పెట్రోలుతో వచ్చి సీతంపేట కూడలిలో కనిపించిన సుధాకర్‌తో మాట్లాడుతూ అతని తలపై పెట్రోలు పోసి నిప్పంటించింది. అతను తీవ్రంగా గాయపడడంతో ద్వారకా పోలీసులు కేజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్వారకా పోలీసులు పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. తొలుత హత్యాయత్నం కేసు నమోదు చేయగా ఇప్పుడు హత్యగా మార్చారు.

టపాసులు కాదు..మిఠాయిలే!

» వినూత్నంగా తయారు చేయించిన దుకాణదారులు, » డ్రై ఫ్రూట్స్, చాక్లెట్ గిఫ్ట్ ప్యాక్‌లకు డిమాండ్, ధరలు పైపైకి



దీపావళి టపాసుల ఆకారంలో తయారు చేసిన మిఠాయిలు



చూడగానే నోరూరించే వైవిధ్యమైన స్వీట్లు



చిచ్చుబుడ్ల రూపంలో స్వీట్లు

డాబాగార్డెన్స్, జగదాంబ కూడలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ అంటే ఠక్కున గుర్తొచ్చేవి టపాసులు... వాటికి జోడీగా మిఠాయిలు.. ప్రమిదలు..అలంకరణలు.. వీటితోనే ప్రతి ఇంటా ఆనందం. నగరంలోని మార్కెట్లను పరిశీలిస్తే ఈ ఏడాది వైవిధ్యమైన రీతిలో మిఠాయిలు విక్రయించడం కనిపించింది. అన్ని వర్గాలవారు కొనుగోలు చేసి ఆనందం పంచుకునేలా విక్రయించాలన్న లక్ష్యంతో కొందరు అందుబాటు ధరల్లో వీటిని విక్రయిస్తున్నారు. అయితే మిఠాయి దుకాణం వద్దకు వెళ్లిన కొనుగోలుదారులు వాటిని చూసి అవాక్కవుతున్నారు. బాణసంచాను పోలిన మిఠాయిలు తయారు చేయడం కొనుగోలుదారుల్లో ఆసక్తి రేపింది. పూర్ణామార్కెట్, టర్నర్ చౌల్ట్రీ తదితర ప్రాంతాల్లో మిఠాయి దుకాణాలు బుధవారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. నేతి మిఠాయిల అమ్మకం జోరుగా సాగింది. మిఠాయిలు కిలో రూ.600 నుంచి రూ.800 వరకు ధర పలకగా, సాధారణంగా లక్ష్మీ పూజలో వినియోగించే అన్ని రకాల స్వీట్స్ ధర రూ. 500 వరకు ఉంది. స్పెషల్ గిఫ్ట్ ప్యాక్‌ల ధర రూ.300 నుంచి రూ.2 వేల వరకు ఉన్నాయి. బర్ఫీ కోవా..మినీబాక్స్..దీపావళి క్రేకర్స్ బాక్స్, డ్రై ఫ్రూట్స్ స్వీట్స్ వంటివి ఆకట్టుకుంటున్నాయి. వీటి తయారీ విధానం కూడా వైవిధ్యంగా ఉంది. మార్కెట్‌లోని..పావు కేజీ రూ.170 నుంచి కేజీ రూ.1800 వరకు ఆయా వివిధ రకాల స్వీట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులోని చాకెట్స్ బాక్సు రూ.320..దీవాళి..హేంపర్ రూ.500 తదితర బాక్సులు వాటికి తగ్గట్టుగా ప్యాకింగ్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు. మిఠాయిల్లో డ్రైఫూట్స్‌ను కూడా మిళితం చేసి విక్రయాలు సాగించారు.

వినూత్నంగా అందించాలన్నదే లక్ష్యం

వినూత్నంగా స్వీట్స్‌ను అందించాలన్న ఉద్దేశంతో తాము ఈ సంవత్సరం టపాసుల మాదిరిగా స్వీట్స్‌ను తయారు చేయించడం జరిగింది. నేటి నుంచి స్వీట్స్‌విక్రయాలు మొదలవుతున్నాయి. వెయ్యి కేజీల నుంచి 2000 కేజీల వరకు వెళ్తాయన్న అంచనాతో ఉన్నాం. స్వీట్స్‌తో పాటు వివిధ రకాలైన స్వీట్స్‌ను మధుమేహ బాధితులు తినేలా అందజేస్తున్నాం. నాణ్యత, వైవిధ్యంతో ప్రజలకు అందజేయాలన్నదే తమ లక్ష్యం.

-విజయకుమార్‌రాజు, శర్వాణీ స్వీట్స్

టీడీపీ సభ్యత్వాల జోరు పెంచండి: ఎంపీ



జిల్లా పార్టీ కార్యాలయంలో శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వాలు చేయాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించి పార్టీని బలోపేతం చేయటానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, నాయకులు మహ్మద్ నజీర్, లొడగల కృష్ణ, పొలమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం శ్రమిస్తే గుర్తింపు



అక్కయ్యపాలెంలో టీడీపీ నాయకులతో సమావేశమైన భరణికాన రాజు

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల నమోదును వేగవంతం చేయాలని 45వ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వార్డు కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కావాలంటే సభ్యత్వాలను ఎక్కువగా చేయించాలని చెప్పారు. పార్టీ కోసం పాటుపడిన వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, పలిశెట్టి అప్పన్న, షేక్‌బాబ్జి పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం



మందుగుండు సామగ్రి విక్రయిస్తున్న దుకాణం

జగదాంబ కూడలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి అక్రమ నిల్వల వ్యవహారం పూర్ణామార్కెట్‌లో కలకలం రేపింది. ఎటువంటి లైసెన్స్‌లు తీసుకోకుండా జనావాసాల మధ్య రహస్యంగా మందుగుండు సామగ్రిని నిల్వచేసిన విషయం బుధవారం మధ్యాహ్నం వన్‌టౌన్ పోలీసుల దాడుల్లో వెలుగుచూసింది. గత వారం పూర్ణామార్కెట్ ఏరియాలోని పండా వీధిలో ఒక ఇంటిలో బాణసంచా నిల్వలను పోలీసులు పట్టుకున్నారు. రద్దీగా ఉండే వ్యాపార కూడలిలో తాళ్ళు, చీపుళ్ళు, చేతి సంచులు అమ్ముతున్న దుకాణంలో అక్రమంగా నిల్వలు బయటపడడంతో మిగిలిన వ్యాపార వర్గాలు ఉలిక్కిపడ్డాయి. ఈ దుకాణదారుడి నుంచి రూ. 4 లక్షల విలువైన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. బాణసంచాను, విక్రయిస్తున్న మహిళలను పోలీసులు ఆటోలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఓ పూల వ్యాపారి రహస్యంగా రూ.30 లక్షల విలువ చేసే మందుగుండు సామగ్రిని నిల్వ చేసినట్లు ఓ మహిళ పోలీసులకు చెప్పడంతో అక్కడ ఘర్షణకు దిగారు.

మార్గశిర మాసోత్సవాలపై చర్చ

పూర్ణామార్కెట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు డిసెంబరు 2 నుంచి 30 వరకు నిర్వహించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో ఈవో కె.శోభారాణి బుధవారం ఆలయంలో చర్చించారు. భక్తుల దర్శనం అనంతరం వెలుపలికి వచ్చే మార్గాన్ని పరిశీలించారు. కొత్తరోడ్డు నుంచి ముఖద్వారం వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, గురువారాల్లో కల్పిస్తున్న వసతులను అధికారులు వివరించారు. ఇంజనీరు రమణ, అధికారులు, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆసుపత్రికి వృద్ధురాలి తరలింపు

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో జడ్జి క్వార్టర్స్ రోడ్డుపై జీవచ్ఛవంలా పడి ఉన్న నాయికుల గోవిందమ్మ (80)ను వైద్యం కోసం ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు విమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ ఆదేశాల మేరకు ఆసుపత్రిలో చేర్పించామని వాసు తెలిపారు. ఆమెకు వైద్య పరీక్షలు చేయగా డెంగ్యూ అని తేలింది. ఆ వృద్ధురాలు శివాజీపాలెం, బలరామ్‌నగర్‌లో కూతురు దుర్గ (61), కుమారుడు సింహాచలం (59)తో కలిసి ఉంటోంది.

ఎమ్మెల్యే దృష్టికి మేదరవీధి సమస్యలు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పూర్ణామార్కెట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పూర్ణామార్కెట్ మేదరవీధిలో సమస్యలు పరిష్కరించాలంటూ యువజన సంఘం ప్రతినిధులు వరసిద్ధి వినాయక వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్ నేతృత్వంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. బుధవారం 35వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. మంచినీటి సరఫరాలో ఇబ్బందులు, యూజీడీ కాలువల సమస్య, నిత్యం విద్యుత్ సరఫరాలో అవాంతరాలను ఆయన దృష్టికి తెచ్చారు. పూర్ణామార్కెట్ ఆధునీకరణ అంశాన్ని, ట్రాఫిక్ నియంత్రణ ఆవశ్యకతను పలువురు ప్రస్తావించారు. గణేశ్ పాఠశాల పక్కన 650 గజాల స్థలంలో సామాజిక భవన నిర్మాణం చేపట్టాలని, రెడ్డి సామాజికవర్గానికి ఆంజనేయస్వామి గుడిపక్కన ఖాళీ స్థలంలో భవనం నిర్మించాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. లక్ష్మీనగర్ హౌసింగ్ స్కీములో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అక్కడ నివాసితులు కోరారు. జనతాబజార్‌ను పునర్నిర్మాణం, కాయగూరల మార్కెట్ వద్ద గణేశ్ ఆలయం ఆధునీకీకరణ, పెరిగివీధి, రామాలయం సందులో సీసీ కెమేరాల ఏర్పాటు వంటి అంశాలను స్థానికులు ప్రస్తావించారు. కొత్త రోడ్డు డంపింగ్ యార్డ్ వల్ల ఇబ్బందులను వివరించారు. యార్డ్‌ను తరలించాలంటూ స్థానిక నాయకులు సూచించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

గ్రూప్-2 పరీక్ష తేదీ ప్రకటనపై హర్షం

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 5న నిర్వహిస్తామన్న ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ ప్రకటనపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో గ్రూప్-1 మళ్లీ ప్రకటించి, మెయిన్స్ నిర్వహించాలని కోరారు.

'సినిమా విజయంతో ఆనందంగా ఉంది'



సమావేశంలో 'ఎంత పని చేశావ్' చిత్ర బృందం

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంత పని చేశావ్ చిత్రం పెద్ద సక్సెస్‌ను అందుకోవడం ఆనందంగా ఉందని కథానాయకుడు శ్రీనివాస్ ఉలిశెట్టి అన్నారు. బుధవారం వెంకటేశ్వర థియేటర్‌లో చిత్ర విజయోత్సవం నిర్వహించారు హీరోగా తన మొదటి చిత్రం అయినప్పటికీ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, లబ్బే సోదరులకు, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ నిహారిక కేశవ్, పటాన్ జిలాన్ కాన్, చిత్ర బృందం పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ విచారణ జరపాలి: స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

పాల సేకరణ ధర తగ్గింపుతో మూడు లక్షల మంది రైతులకు నష్టం

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో 7.95 ఎకరాల భూమిని విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించినట్టు వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 7.95 ఎకరాలను విశాఖ డెయిరీ ఆక్రమించుకున్నట్టు పీతల మూర్తియాదవ్ చేసిన ఆరోపణపై కలెక్టర్ విచారణ చేయాలన్నారు. పూర్వం శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకు పాడి రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం విశాఖ డెయిరీ స్థాపించారని, ఇప్పుడు కమర్షియల్‌గా మారిపోయి రైతుల సంక్షేమాన్ని పక్కన పెట్టారని విమర్శించారు. డెయిరీ స్వలాభం కోసం ఆవు పాల సేకరణ ధర లీటరుకు రూ.3 తగ్గించడంతో మూడు లక్షల మంది రైతులు నష్టపోనున్నారన్నారు. వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెంనాయుడు విశాఖ డెయిరీపై విచారణ చేయించి, వాస్తవమని తేలితే చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి అన్ని పార్టీలు రైతులు పక్షాన పోరాడాలని అయ్యన్న పిలుపునిచ్చారు.

కిక్కిరిసిన సీతమ్మధార రైతుబజార్



పిచ్చుక గూడు రూపంలో ప్రమిదలు

సీతమ్మధార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా సీతమ్మధార రైతుబజార్ కొనుగోలుదారులతో బుధవారం కిక్కిరిసింది. పెద్ద సంఖ్యలో జనం కూరగాయాలు కొనుగోలు చేయడంతో పాటు దీపావళి పూజకు కావలసిన సామాగ్రి కొనుగోలు చేశారు. పూల ధరలు అమాంతం పెంచేశారని కొనుగోలుదారులు వాపోయారు. సాయంత్రం కూడా బజారుకు అధిక సంఖ్యలో రావడంతో రద్దీగా కనిపించింది. సంప్రదాయాల్లో భాగంగా ఆముదం కర్ర కొనుగోలుకు ఆసక్తి చూపించారు. వీటిని కూడా గ్రామీణులు విక్రయానికి ఎక్కువగా తీసుకొచ్చారు. రైతుబజార్ బయట తోపుడు బండ్లపై విక్రయించిన మట్టి ప్రమిదలు అమితంగా ఆకట్టుకున్నాయి. లక్ష్మీదేవి రూపంతో ఉన్న దీపం ప్రమిదలు, పిచుక గుడులో ఉన్నవి, మంచినీటితో వెలిగించే ప్రమిదలను ఎక్కువగా కొనుగోలు చేశారు. కొనుగోలుదారులు తమ వాహనాలను బజార్ బయట చిరు వ్యాపారుల తోపుడు బండ్ల ముందు పెట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పార్కింగ్ స్థలంలో కాకుండా బజార్ బయటే అడ్డదిడ్డంగా పెట్టడంతో పాదచారులు, ఇతరులు ఇబ్బంది పడ్డారు.

చంద్రబాబు స్త్రీ పక్షపాతి: గండిబాబ్జీ



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెలుగు మహిళలు

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తున్న చంద్రబాబు నాయుడు స్త్రీ పక్షపాతి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. గతంలో దీపం పథకం, నేడు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించి మధ్యతరగతి మహిళలకు ఊరట కలిగిస్తున్నారని, సూపర్ సిక్స్ పథకాల్లో మొదటిగా దీపావళి కానుక అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, రాగిన అనంతలక్ష్మి, వేణు, పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

భర్త, అత్తమామలతో పాటు తోటికోడలు, బావ అరెస్టు



చిన్ని దివ్యశ్రీ మృతదేహం

కూర్మన్నపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని పెదజాలరిపేట ప్రియదర్శిని కాలనీకి చెందిన చిన్ని దివ్యశ్రీ (19)కు 88వ వార్డు పరిధి మంగళపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన చిన్ని శరత్‌కుమార్‌తో గత ఏడాది మార్చి 18న వివాహమైంది. అప్పటినుంచి దివ్యశ్రీకి అదనపు కట్నం కోసం వేధింపులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో అత్త సత్య, మావయ్య అప్పారావు, భర్త శరత్‌కుమార్‌లు నిత్యం తనను వేధిస్తున్నారంటూ ఆమె తల్లిదండ్రులకు చెప్పుకుని బాధపడేది. కాగా దివ్యశ్రీకి జూన్‌లో కుమారుడు పుట్టాక, మూడు నెలల తర్వాత అత్తింటికి వెళ్లింది. ఇంటి కోసం తోటి కోడలు లక్ష్మి, బావగా వేణు గొడవలు పడుతుండేవారని, వారిద్దరితో పాటు అత్తమామలు, భర్త ఏకమై తనను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు కన్నవారికి దివ్యశ్రీ పలుమార్లు చెప్పింది. ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలప్పుడు దివ్యశ్రీ తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంట్లో వారందరూ తనతో గొడవ పడుతున్నారనీ, తనను ఏమి చేస్తారోనని, ఇక బతకనని చెప్పి ఫోన్ కట్ చేసింది. తిరిగి వారు ఎవరికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అయితే అదేరోజు మధ్యాహ్నం మూడున్నరప్పుడు అత్త సత్య ఫోన్ చేసి దివ్యశ్రీ మృతి చెందిందని చెప్పడంతో దివ్యశ్రీ తల్లిదండ్రులు పీతల సూర్యలక్ష్మి, ఈశ్వరరావు మంగళపాలెం చేరుకున్నారు. అత్తింటి వారి వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులకు సూర్యలక్ష్మి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దివ్యశ్రీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వేధింపులకు తాళలేకే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని దివ్యశ్రీ ఆత్మహత్య చేసుకున్నట్టు నిర్ధారించిన పోలీసులు భర్తతో పాటు అత్తమామలు, తోటికోడలు, బావలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు

'బీసీల అభ్యున్నతికి కృషి చేస్తా'



జిల్లా బీసీల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న విల్లూరి చక్రవర్తి

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ కులాల సమైక్య సంక్షేమ సంఘం విశాఖ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విల్లూరి చక్రవర్తి తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు సారథ్యంలో జిల్లా అధ్యక్షుడు రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశాఖ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తనకు నియామక పత్రాన్ని అందజేశారన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన ఎమ్మెల్సీ రామారావు, రవి, వి.నూకరాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏయూ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు

బాణసంచా స్టాల్స్ వద్ద చోద్యం చూస్తూ ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డులో బుధవారం రద్దీ నెలకొంది. ఈ మైదానంలో బాణసంచా స్టాళ్ల ఏర్పాటు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీపావళికి ఒక్కరోజే ఉండడంతో బుధవారం కొనుగోలుదారుల తాకిడి పెరిగింది. దీంతో ఏయూ మైదానం రోడ్డులో ఎక్కడికక్కడే ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ పోలీసులు స్టాల్స్ ఏర్పాటు చేసిన మైదానాలకే పరిమితమయ్యారు. కొనుగోలుకు వచ్చే వారు వాహనాలను పార్కింగ్ చేయించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో కిలోమీటరున్న ఏయూ రోడ్డు వాహనాలతో కిక్కిరిసింది. కొనుగోలుదారులు రోడ్డు మీదే వాహనాలు పార్కింగ్ చేసి స్టాల్స్‌కు వెళ్లడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది.


మైదానంలో రోడ్డులో భారీగా నిలిచిపోయిన వాహనాలు

19వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం 19వ వార్డులో స్థానిక కార్పొరేటర్ నొల్లి నూకరత్నం ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుమాట్లాడుతూ సుపరిపాలనే లక్ష్యం చంద్రబాబు విజన్, కూటమి పాలన సాగుతుందన్నారు. పెద జాలారిపేటలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, టీడీపీ నాయకులు తెడ్డు నూకరాజు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఏయూ తెలుగు విభాగంలో ఆహ్వాన వేడుకలు

వెంకోజీపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తెలుగు విభాగంలో ఆహ్వాన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం స్నాతకోత్తర విద్యార్థులు, ఎంఏ తెలుగు ప్రథమ సంవత్సరం చేరిన విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహం మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానసముపార్జనపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ భద్రతా పీఠాధిపతి అరుణ్‌కుమార్, డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టిపోగు రత్నశేఖర్, పరిశోధక విద్యార్థులు గంట్ల శ్రీనుబాబు, స్నాతకోత్తర విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధన్వంతరి వ్రతం


వ్రతంలో పాల్గొన్న మహిళలు

సిరిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ధనత్రయోదశి, ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని సిరిపురం పాండురంగాస్వామి ఆలయంలో లయన్స్ ఇంటర్నేషనల్ వీఎస్పీ, నార్త్ ఈస్ట్ వనిత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ధన్వంతరి వ్రతాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ కృష్ణశర్మ బృందం వ్రతాలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్స్ వి.సాయినిర్మల, ఎం.శుభాదేవి, సంస్థ అధ్యక్షులు ఎస్.సాధన, కార్యదర్శి వి.అనురాధ, కోశాధికారి టీపీ మంగమ్మ, ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, ఆలయ ఈవో, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వైసీపీలోనే ఉన్నా

13వ వార్డు కార్పొరేటర్ సునీతసత్యనారాయణ


మాట్లాడుతున్నసునీత సత్యనారాయణ

ఆరిలోవ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తాను వైసీపీలోనే ఉన్నానని, పార్టీ మారలేదని 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వారు తమ కార్యాలయంలో మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం వచ్చిన యాడ్‌ను చూసిన కొందరు తాము పార్టీ మారినట్టు భావించారని, అయితే తాను వైసీపీలోనే కొనసాగుతానని చెప్పారు.

దీపావళి వేడుకల నిర్వహణపై అవగాహన సదస్సు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాలలో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బుధవారం దీపావళి వేడుకల నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈఎన్‌టీ వైద్య నిపుణుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ దీపావళి సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, టపాసులు కాల్చడం వల్ల వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

పాఠశాలల్లో దీపావళి వేడుకలు

వెంకోజీపాలెం, అక్టోబరు 30 : దీపావళిని పురస్కరించుకుని బుధవారం ఇసుకతోటలోని శ్రీచైతన్య టెక్నో స్కూలులో ప్రిన్సిపాల్ ఎన్.రమణి ఆధ్వర్యంలో మన సంస్కృతీసంప్రదాయాలను వివరిస్తూ వేడుకలు నిర్వహించారు.

హెచ్‌బీ కాలనీలోని శ్రీశారదా విద్యానిలయంలో చిన్నారులు దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు.

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం
బురుజుపేట, విశాఖపట్నం. ఫోన్ నెం.0891-2568645, 2566515
ఆర్.సి.నెం.ఇ/909/2024, తేది.30-10-2024

మార్గశిరమాసం ఉత్సవ ప్రత్యేక పనులు & మెయింటెనెన్స్ - 2024 మరియు ఇతర పనులు

షార్ట్ టెండర్ / సీల్డ్ కొటేషన్ ప్రకటన

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మార్గశిరమాసోత్సవములు - 2024 సందర్భంగా ఈ క్రింది పనులకు సీల్డ్ టెండర్లు/కొటేషన్లు పిలువబడినవి.

క్ర. సం.	పని వివరములు షెడ్యూల్ ఫార్మ్‌లో తెలిపిన విధముగా	ధరావత్తు	టెండర్ షెడ్యూలు ఖరీదు	పని పూర్తి చేయుకాలం & నిర్వహణ	అర్హత
1.	ఎ. భక్తులకు 30 రోజులు భోజనం మరియు అల్పాహారం, ఏర్పాటు చేయుటకు (వంట పాత్రలు, వడ్డన సామగ్రితో సహా). బి. మహా అన్నదానం తయారు చేయుటకు షెడ్యూల్‌లో తెలిపిన ప్రకారం	10,000/-	3,000/-	30 రోజులు	అనుభవం గల గుర్తింపు గల సంస్థ
2.	దేవస్థానం అవసర నిమిత్తం ఎలక్ట్రికల్ సామాన్లు సప్లయి చేయుటకు షెడ్యూల్‌లో తెలిపిన ప్రకారం	5,000/-	1,000/-	1 సంవత్సరం కాలమునకు	దేవస్థానముల యందు మరియు కేటరింగ్ నిర్వహణ యందు అనుభవం గలవారు
3.	వివిధ పనులకు గాను మ్యాన్ పవర్ సప్లయి చేయుట షెడ్యూల్‌లో తెలిపిన ప్రకారం	3,000/-	500/-	30 రోజులు	గుర్తింపు గల సంస్థ

గమనిక : పై క్ర.సం.1 నుండి 3 వరకు గల టెండర్ సప్లయి షెడ్యూల్ నందు తెలిపిన ప్రకారం
నిబంధనలు: 1. టెండర్ షెడ్యూల్ కొరకు ధరఖాస్తు తేది.05-11-2024 సాయంత్రం 5.00 గం.ల వరకు స్వీకరించబడును. 2. తేది.11-11-2024, ఉ॥ 10.00 గంటల నుండి మ.2.00 గంటల వరకు సీల్డ్ టెండర్లు, టెండర్ బాక్సులో వేయవలెను. 3. అదే రోజు మధ్యాహ్నం 4.00 గంటలకు టెండర్లు తెరవబడును. 4. పై పనులను రద్దు చేయుటకు మరియు ఆమోదించుటకు గాను శ్రీ యుత కార్యనిర్వహణాధికారి వారికి పూర్తి అధికారము కలదు. 5. ఇతర వివరములకు దేవస్థానము కార్యాలయము పనివేయు వేళలలో సంప్రదించవలెను. ఫోన్ నెం. 0891-2731250, 7075099449, 9704778288.

శ్రీమతి కె. శోభారాణి
ఉప కమీషనరు & కార్యనిర్వహణాధికారి

In the Honourable Court of the VII Addl. Senior Civil Judge at Visakhaptanam
O.S. 356/2023

Between :
Smt. Chilakapati Siva Rani ...Plaintiff
And
Sri karri Lakshminarayana Reddy & 2 others ...Defendants

SUMMONS

To,
D-1: Sri Karri Lakshminarayana Reddy, S/o. Kondareddy, Hindu, aged about 45 years, R/at Plot No.25, D.No.2-1, Near Lakshminarayana Swamy Temple, Adarshnagar, Visakhapatnam-41.
D-3: Sri Karri Samudra Reddy, S/o. Rammurthy Reddy, Hindu, aged about 49 years, R/at Plot NO. 131, D.No.12-89, Ganesh Colony, Narasimhanagar, Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the matter stands posted to **21-11-2024** for your appearance on that day **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte.

(By Order of the Hon'ble Court)
N.V. SUMAN, Advocate,
Visakhapatnam. Cell: 9440041877

In the Honourable Court of the VII Addl. Senior Civil Judge at Visakhaptanam
I.A. 830/2023 & I.A.831/2023 in O.S.356/2023

Between :
Smt. Chilakapati Siva Rani ...Petitioner/Plaintiff
And
Sri karri Lakshminarayana Reddy & 2 others ...Respondents/Defendants

NOTICE

To,
R-1: Sri Karri Lakshminarayana Reddy, S/o. Kondareddy, Hindu, aged about 45 years, R/at Plot No.25, D.No.2-1, Near Lakshminarayana Swamy Temple, Adarshnagar, Visakhapatnam-41.
R-3: Sri Karri Samudra Reddy, S/o. Rammurthy Reddy, Hindu, aged about 49 years, R/at Plot NO. 131, D.No.12-89, Ganesh Colony, Narasimhanagar, Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above petitions against you and the matter stands posted to **21-11-2024** for your appearance on that day **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte.

(By Order of the Hon'ble Court)
N.V. SUMAN, Advocate,
Visakhapatnam. Cell: 9440041877

2న ఇస్కాన్‌లో గోవర్ధన పూజ

సాగర్‌నగర్, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో వచ్చేనెల రెండో తేదీన గోవర్ధన పూజా నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు సాంబదాసు తెలిపారు. ఉత్సవంలో భాగంగా అన్నకూట్ (ఆహార పర్వతం) ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం 1,008 రకాల భోగాలను గిరిరాజుకు సమర్పించి, ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేస్తామన్నారు.

వెలుగుల పండుగ





అమావాస్య చీకట్లను తొలగించే దీపావళి

- దేశవ్యాప్తంగా సంబరంగా జరిపే వేడుక
- వివిధ దేశాల్లో అనేక పేర్లతో నిర్వహణ
- సంబరాలకు సన్నద్ధమైన జిల్లా వాసులు

సింహాచలం, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి):

'దీపం జ్యోతిః పరబ్రహ్మ దీపం సర్వతమోపహమ్:
దీపేన సాధ్యతే సర్వం సంధ్యాదీపం నమోస్తుతే.

చీకటి వెలుగుల రంగేళీ... జీవితమే ఒక దీపావళి అని ఓ సినీకవి దీపావళి ప్రాశస్త్యాన్ని వివరించారు. శ్రీమహావిష్ణువు వామనుడిగా బలిచక్రవర్తిని పాతాళానికి తొక్కినందుకు, శ్రీరాముడు రావణుని వధానంతరం అయోధ్య చేరుకుని పట్టాభిషిక్తుడైనందుకు, శ్రీకృష్ణుడు సత్యభామా సమేతుడై లోకకంటకుడైన నరకాసురుని తుదముట్టించిన సందర్భాలను పురస్కరించుని ప్రజలు ఆనందోత్సాహాలతో దీపావళి జరుపుకున్నట్టు పురాణాలను విశదమవుతోంది. అదేవిధంగా శ్రీమహాలక్ష్మి విష్ణులోకం నుంచి భూలోకానికి దిగివచ్చి సంచరిస్తుందని, దీపావళి రోజున ఆమె రాకను స్వాగతిస్తూ కాంతులు వెదజల్లేలా దీపాలు వెలిగించాలని పెద్దలు చెబుతారు. కారణమేదైనా దీపావళి దేశప్రజలంతా సంబరంగా చేసుకునే పండుగ.

ఆశ్వయుజ బహుళ చతుర్దశిని నరక చతుర్దశిగా, అమావాస్యను దీపావళిగా, కార్తీక శుద్ధ పాడ్యమిని బలిపాడ్యమిగా నిర్వహించడం హిందూ సంప్రదాయం. జాతి, కుల, వర్గ విచక్షణ లేకుండా సర్వమానవ సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా, సంస్కృతి, విలువలను విశ్వవ్యాప్తంగా చాటే పండుగ దీపావళి. గురువారం పండగకు ప్రజలు సన్నద్ధమయ్యారు.

విభిన్న రీతిలో పండుగ

దీపావళిని వివిధ ప్రాంతాల్లో విభిన్న రీతుల్లో జరుపుకుంటారు. మనిషిలో దిగిన విచారా(చీకటి)న్ని పోగొట్టి ఆనందాన్ని (వెలుగు) వికసింపజేస్తుందని, దీపాలు వెలిగించడాన్ని సంతోషానికి సంకేతంగా అభివర్ణిస్తారు. సాయంత్రం కాగానే దీపాలు వెలిగించి, బాణసంచా కాల్చి ఇంటిల్లిపాదీ ఆనందోత్సాహలతో నిండిపోవడమే దీపావళి పరమార్థం. మార్వాడీలు దీపావళిని లక్ష్మీపూజకు సంకేతంగా భావిస్తారు. వారి సంప్రదాయం మేరకు బంగారాన్ని పూజా గదిలో లేదా ఉంచి లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. వ్యాపారాలకు సంబంధించిన ఖాతా పుస్తకాలను ముగించి, కొత్తవాటికి శ్రీకారం చుడతారు. ఈ పండుగ వెనుక ప్రకృతి పరమైన కారణాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతారు. వర్షాకాలం ముగిసిన తర్వాత దీపావళి వస్తుంది. అప్పటికే చాలా చోట్ల నీటి నిల్వలు ఉండడంతో క్రిమికీటకాదులు, దోమలు వ్యాప్తి చెందుతాయి. దీపావళి రోజున సరదాగా కాల్చే బాణసంచాలోని రసాయన పొగతో ఇవన్నీ నాశనమవుతాయి.





దీపం విశిష్టత...

సంధ్యాదీపం అంటే నూనెతో వెలిగించిన ప్రమిద. అందులో లక్ష్మీదేవి ఉంటుందని విశ్వాసం. ఉదయ దీపాన్ని దైవసన్నిధిలో, సాయం దీపాన్ని ఇంటి ప్రధాన ద్వారం వద్ద ఉంచి నమస్కరించాలి. ప్రమిదలోని నూనె వైరాగ్యానికి, వెలుగుతున్న దీపం జ్ఞానజ్యోతికి, దీపం నుంచి వెలువడే వెలుగు భక్తికి గురుతుగా చెబుతారు. దీపావళి రోజు సాయంత్రం లక్ష్మీదేవిని పూజిస్తారు. అనంతరం తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఇంటి ముంగిట దీపాల వరుసను అమరుస్తారు. అంతేకాదు ఈ రోజున యమతర్పణం వంటి విధులను నిర్వహిస్తారు. మరుసటి రోజు బలిచక్రవర్తిని పూజిస్తారు. కాంతులను ప్రసరించే దీపావళి చైతన్యం, వికాసానికి సంకేతం. అగ్నిస్వరూపమైన దీపం జ్ఞాన,సత్య, నిర్మల తత్వాలకు సంకేతం. దీపావళి ఎప్పుడూ మానవాళికి మహాపర్వమే.

ఒక్కో చోట... ఒక్కో రీతి...

దేశంలోని వివిధ రాష్ట్రాల వాసులు ఒక్కో పేరుతో దీపావళిని జరుపుకుంటారు. సిక్కులు అమృతసర్‌లోని స్వర్ణదేవాలయాన్ని దీపాలతో అలంకరించి ప్రార్థనలు చేస్తారు. వారి మత గురువైన గురుహర గోవింద సాహిల్ మొగల్ చక్రవర్తుల చెర నుంచి విడుదలైన రోజు. జైనులు మహావీరుని నిర్యాణదినంగా భావించి దీపాలు వెలిగిస్తారు. రెడ్డిరాజుల కాలంలో దీపావళిని 'దివ్వెల పండుగగా' వ్యవహరించేవారని సింహసనాద్వాత్రిశతక ద్వారా తెలుస్తోంది. ఈ పండుగను యక్షరాత్రిగా జరిపినట్టు వాత్సాయన కామసూత్రాలద్వారా అవగతమవుతుంది. శ్రీపతి అనే మరాఠా కవి తన జ్యోతిషరత్నమాలలో దీపావళి ప్రాశస్త్యాన్ని వివరించాడు. గుజరాత్, బెంగాల్ రాష్ట్రాల్లోని రైతులు దీపావళిని 'పశుపూజారి' దినోత్సవంగా జరుపుకుంటారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో గోవర్ధనగిరి నిర్మించి పూజలు చేస్తారు. రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్‌లో విభూత దయా నిర్దేశంగా జరుపుతారు. కుక్కలకు, కాకులకు ఆహారాన్ని పెట్టి పూజిస్తారు. రాజస్థాన్‌లో హిడ్‌పూజ నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని కాకత్సోహార్ అని పిలుస్తారు. మధుర ప్రాంతంలో అన్నకూట్ పేరుతో జరుపుతారు. పశుపక్ష్యాదులకు ఆహారాన్ని పెట్టి గౌరవిస్తారు. పశ్చిమబెంగాల్, ఒడిశాలో జగద్ధాత్రి పేరిట కాళీపూజలు చేస్తారు. కేరళలో బలి చక్రవర్తిని జయించిన రోజుగా, తమిళనాట దీపావళి రోజున వివాహితలు పుట్టింటికి వెళ్లి కానుకలు తెచ్చుకోవడం సంప్రదాయం. మహారాష్ట్రలో దీపావళి రోజున లక్ష్మీపూజ చేస్తారు.

ప్రపంచ దేశాల్లో...

జపాన్‌లో తోరన్‌గోష్టి, మారిషస్, వియత్నాంలో నూతన సంవత్సరాదిగా దీపావళిని జరుపుకుంటారు. సుమిత్రా, జావా ద్వీపాలు, జర్మనీలో దీపావళిని ఘనంగా జరుపుకుంటారు. ఇరాన్, ఇరాక్, ఆస్ట్రేలియా, స్వీడన్‌లో లూసియాడేగా నిర్వహిస్తారు. నేపాల్‌లో నేపాల్ తీహార్‌గా, ఆంగ్లేయులు గైఫాక్స్ పేరుతో, బర్మాలో అంగేజు ల పండుగ, చైనాలో నాయి మహంబా పేరున దీపాలు వెలిగించి సంబరాలు చేసుకుంటారు. థాయ్‌లాండ్‌లో దీపావళి రోజున దీపాలను వెలిగించడం పవిత్ర కార్యంగా భావిస్తారు. శ్రీలంకలో దీపావళిని జాతీయ పర్వదినంగా నిర్వహిస్తారు. ఇజ్రాయల్‌లో స్వాతంత్ర యోధుడు మెకాబ్బిన్ స్మృత్యర్థం హనుక పేరుతో దీపోత్సవం చేస్తారు.

మార్కెట్‌లో కనిపించని దీపావళి జోష్

» తగ్గిన స్వీట్స్, డ్రైఫ్రూట్స్ విక్రయాలు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా దీపావళి పండగకు స్వీట్స్, డ్రైఫ్రూట్స్ విక్రయాలు భారీగా సాగుతాయి. కానీ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో విక్రయాలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే పది శాతం మేర తగ్గాయంటున్నారు. ఏటా దీపావళికి భారీగా ఆర్డర్లు వస్తుంటాయి. ఈసారి అవి గణనీయంగా తగ్గాయని వ్యాపారులు వాపోతున్నారు. సుమారు రూ.10 కోట్ల మేర స్వీట్స్, డ్రైఫ్రూట్స్ వ్యాపారం జరుగుతుందని, అయితే ఈ సారీ రూ.కోటి వరకు తక్కువగానే జరిగే అవకాశముందని చెబుతున్నారు. గురువారం విక్రయాలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు. నగర పరిధిలో సుమారు 700 స్వీట్స్ దుకాణాలున్నాయి. ఆయా దుకాణాల్లో 70వేల కిలోల స్వీట్స్ విక్రయాలు జరుగుతుంటాయి. కానీ, ఈ ఏడాది ఐదు నుంచి పది వేల కిలోల వరకు తక్కువ ఉంటుందని అంచనా వేస్తున్నారు.



ఓ దుకాణంలో స్వీట్స్ కొంటున్న వినియోగదారులు

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.7 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కట్న, కానుకల ద్వారా రూ. 1.7 కోట్ల ఆదాయం సమకూరింది. ఈఓ వేంద్ర త్రినాథరావు పర్యవేక్షణలో పరకామణిలో బుధవారం లెక్కింపు చేపట్టారు. గత 30 రోజులకు గాను సుమారు రూ.1,70,22,443 నగదు లభించింది. 57.9 గ్రాముల స్వర్ణం, 10.130కిలోల రజితం సమకూరింది. 25 యూఎస్ డాలర్లు, 70 ఆస్ట్రేలియా డాలర్లు, 11 సింగపూర్ 11 డాలర్లు, 20 స్కాట్‌లాండ్ పౌండ్లు, 60 యూఏఈ దీరమ్స్, 20 నేపాల్ రూపాయలు, ఒమన్‌కు చెందిన 200 బియాస్, భూటాన్, ఖతర్, నైజీరియా, ఇండోనేషియాకరెన్సీ వచ్చింది. ఈఈలు డీసీ శ్రీనివాసరాజు, బి.రాంబాబు, ఏఈఓలు, స్వచ్ఛంద సంస్థల సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

'కోల్‌కతా కేసులో దోషులను శిక్షించాలి'



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల వేదిక సభ్యులు

సిరిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై అత్యాచారం జరిపిన సంఘటనలో సీబీఐ విచారణ పూర్తి చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఐఎఫ్‌టీయూ, పీఓడబ్ల్యు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కేసును సీబీఐకి అప్పగించి రెండు నెలలు గడుస్తున్నా పురోగతి లేదన్నారు. జూనియర్ డాక్టర్లు అందజేసిన సాక్ష్యాలపై ఆధారపడి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారిని, కాలేజీ ప్రిన్సిపాల్‌ను మాత్రమే అరెస్టు చేశారన్నారు. సీబీఐ విచారణను తక్షణమే పూర్తిచేసేలా కోర్టు కాలపరిమితి విధించాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక దాడుల నిరోధకానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, కొండయ్య, కిశోర్, టి.శ్రీరామ్మూర్తి, చిన్నారావు, చలం, ఎస్.వెంకటలక్ష్మి, రవి, గీత, తిరుపతిరావు, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

రేపటి నుంచి సీఎం ఉత్తరాంధ్ర పర్యటన

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రెండు రోజుల పర్యటన కోసం నవంబరు ఒకటో తేదీన విశాఖ రానున్నారు. ఆయన శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నం చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లాకు వెళ్లి అక్కడ ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం శ్రీకాకుళం చేరుకుని రాత్రి బస చేస్తారు. నవంబరు రెండో తేదీ ఉదయం విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గంలో పర్యటించి, అక్కడ నుంచి హెలికాప్టర్‌లో నగరానికి వస్తారు. జిల్లా అభివృద్ధిపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తారు. సీఎం పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ విడుదల కావలసి ఉంది.

జిల్లాలో అభివృద్ధి ప్రాజెక్టులు, 100 రోజుల ప్రణాళికపై ఈనెల రెండో తేదీన ముఖ్యమంత్రి సమీక్షిస్తారని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన...ఇప్పటివరకూ చేపట్టిన అభివృద్ధి పనులు, 100 రోజుల ప్రణాళికలో చోటు కల్పించిన అంశాలు, ప్రగతి నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తమ తమ శాఖలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో రావలసిన అనుమతులు, నిర్ణయాలు పెండింగ్‌లో ఉంటే చెప్పాలన్నారు. సమీక్షలో డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, సీపీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'శ్రీనివాసకుమార్ సేవలు ఆదర్శం'

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో ఏడీగా పనిచేసిన శ్రీనివాసకుమార్ సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి పదోన్నతిపై శ్రీకాకుళం మెడికల్ కాలేజీకి వెళ్లిన ఆయనకు బుధవారం వీడ్కోలు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెం డెంట్ డాక్టర్ శివానంద మాట్లాడుతూ అంకితభావంతో పనిచేశారన్నారు. ఆర్ఎంవోలు ధవళ భాస్కరరావు, మెహర్‌కుమార్, రాజేష్, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ మూర్తియాదవ్ బ్లాక్ మెయిలర్

» డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ బ్లాక్‌మెయిలర్ అని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఏయూ మైదానంలో గత ఏడాది బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తాను డబ్బులు తీసుకున్నట్టు చేసిన ఆరోపణలో వాస్తవంలేదన్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి బ్లాక్‌మెయిల్‌చేసి మూర్తియాదవ్ డబ్బులు వసూలుచేస్తున్నాడని ఆరోపించారు. ఓ వైద్యురాలి జీతాన్ని డ్రా చేసేస్తున్నారని విమర్శించారు. మూర్తియాదవ్‌పై చీటింగ్, మహిళలను మోసం చేసిన కేసులున్నాయన్నారు. వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫాకృష్ణ మాట్లాడుతూ శ్రీధర్‌పై చేసిన ఆరోపణలు రుజువు చేయకుంటే కార్పొరేటర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న జియ్యాని శ్రీధర్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



శ్రావణ్‌కుమార్ (ఫైల్)

పెందుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళికి ఓ అపార్ట్‌మెంట్‌కు విద్యుత్ అలంకరణ చేస్తుండగా విద్యుదాఘాతంలో యువకుడు మృతి చెందాడు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. చిన ముషిడివాడ హుద్‌హుద్ కాలనీకి చెందిన తాళ్లపూడి శ్రావణ్‌కుమార్ (27) ఎలక్ట్రీషియన్. స్థానిక మణికంఠ ప్రైవేటు లైటింగ్ వద్ద పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి చినముషిడివాడ వుడా కాలనీలోని అపార్ట్‌మెంట్‌కు లైట్లు అమర్చుతుండగా, జీఈ వైరు ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్‌ఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. స్థానికులు పెందుర్తిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడుకి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పెందుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడు సొత్తును విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుకున్నారు. ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రహ్లాదపురం పల్లినారాయణపురంలో నివసిస్తున్న బాలకృష్ణ ఈ నెల 14న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి విజయనగరం జిల్లా బొండపల్లి మండలం ముద్దూరు వెళ్లారు. ఇంటి తలుపులు తెరిచిఉన్నాయని యజమాని భాగ్య ఈ నెల 23న బాలకృష్ణకు ఫోన్ చేసి చెప్పారు. ఇంటికి వచ్చి చూడగా ట్రంకుపెట్టెలో భద్రపరిచిన అర తులం బంగారం, పది తులాల వెండి కనిపించలేదు. దీనిపై బాధితుడు ఫిర్యాదు మేరకు క్రైం ఎస్ఐ సూరిబాబు దర్యాప్తు చేపట్టి అదే భవనంలో పైఅంతస్తులో అద్దెకుంటున్న దున్న శేఖర్ కదిలికలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో శేఖర్ చోరీ చేసిన సొత్తును బుధవారం సుజాతనగర్‌లో విక్రయిస్తుండగా పట్టుకున్నారు. చోరీ సొత్తు స్వాధీనం చేసుకొని, అరెస్టు చేశామన్నారు.

సందడిగా రన్‌ఫర్ యూనిటీ ర్యాలీ

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసుల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ పేరుతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ ఎరీనా నుంచి సర్క్యూట్‌హౌస్ జంక్షన్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహం వరకూ జరిగిన ర్యాలీలో సీపీ శంఖబ్రత బాగ్చి ర్యాలీలో పాల్గొని పటేల్ విగ్రహానికి పూలమాల వేశారు. దేశ ఐక్యత, అంతర్గత భద్రతకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేయించారు.



ర్యాలీలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ, అధికారులు

నిత్యావసరాల ధరలు అదుపు చేయాలి : ఐద్వా

సిరిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరకుల ధరలు అదుపు చేయాలని, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నరకాసురుని వధ పేరుతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరకులు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఫ్యూచర్ ట్రేడింగ్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు వరలక్ష్మి అనురాధ, బొట్టా ఈశ్వరమ్మ, భారతి, కొండమ్మ, సుజాత, ప్రభావతి, కామేశ్వరి, గీతాంజలి, కుమారి, చంద్రకళ పాల్గొన్నారు.



ధరల నరకాసురుడి బొమ్మతో ఐద్వా నిరసన

సముద్ర జలాలు కలుషితం కాకుండా చూడాలి

» ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉత్పత్తి అవుతున్న మురుగునీరు సముద్రంలో కలిసిపోతుండడం వల్ల సముద్రజలాలు కలుషితమవుతున్నాయని, దీనికి అడ్డుకట్టవేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య ఆదేశించారు. బుధవారం నగరంలో పర్యటించిన ఆయన జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి బీచ్‌లో మురుగునీరు కలుస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. సముద్రంలోకి కిలోమీటరు దూరం వరకూ పైప్‌లైన్‌వేసి మురుగునీటిని పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనివల్ల తీరంలో దుర్గంధానికి అడ్డుకట్టవేయడంతో పాటు చెత్త చేరకుండా నియంత్రించవచ్చునన్నారు. దీనికి జీవీఎంసీ కమిషనర్ స్పందిస్తూ నగరంలో ఇప్పటికే రెండుచోట్ల మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లు (ఎస్‌టీపీ) నిర్మాణంలో ఉన్నాయని, ఈ ఏడాది డిసెంబరు నాటికి ఒకటి, వచ్చేఏడాది ఆగస్టుకి మరొకటి అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం కాపులుప్పాడలోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తిచేసే ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్ పనితీరు వివరాలను జీవీఎంసీ కమిషనర్ వివరించారు. జీవీఎంసీతోపాటు విజయనగరం, శ్రీకాకుళం, నెల్లిమర్ల నుంచి చెత్తను తీసుకొచ్చి విద్యుత్ ఉత్పత్తిచేస్తున్నామని వివరించారు. అనంతరం అక్కడే వున్న ర్యాగ్‌పిక్కర్లు (చెత్త నుంచి ప్లాస్టిక్ ఏరుకునేవారు)తో మాట్లాడారు. వారి కోసం ప్రత్యేకంగా షెడ్డు నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సీఈ పి.శివప్రసాదరాజు, ఎస్ఈ గోవిందరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పీసీబీ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.



సముద్రంలో చేరుతున్న వ్యర్థ జలాలలను పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య, అధికారులు

విశాఖపట్నం: కాలుష్య నియంత్రణమండలి చైర్మన్ పి.కృష్ణయ్య బుధవారం భీమిలి మండలం చిప్పాడలో దివీస్ లేబొరేటరీని సందర్శించారు. ఉత్పత్తి, వ్యర్థాలపై తెలుసుకున్నారు. పరవాడ రాంకీ ఫార్మాసిటీని సందర్శించి ఘన, ద్రవ వ్యర్థాల ఫిల్లింగ్, శుద్ధి విధానాన్ని పరిశీలించారు. ఆయన వెంట జోనల్ చీఫ్ ఇంజనీరు కె.రమేష్, ఈఈ పి.ముకుందరావు ఉన్నారు.

మద్యం దుకాణం మార్పు నిర్ణయంతో మహిళల హర్షం

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నౌరోజీ రోడ్డు పందిమెట్ట జంక్షన్ వద్ద మద్యం దుకాణం ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతంలో మద్యం దుకాణం వద్దంటూ మహిళలు పది రోజులపాటు ఆందోళన నిర్వహించారు. అక్కడే వంటావార్పు చేసి నిరసన తెలిపారు. దీంతో నిర్వాహకులు వెనక్కి తగ్గారు. జనసేన నాయకుడు నెక్కళ్ళ త్రినాథ్ నాయకత్వంలో శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి తమ అభిమతాన్ని గౌరవించినందుకు, మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా తగిన సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగితపు మణి, బోరా శ్రీను, బహ్మస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేసిన వారిపై చర్యలేవీ?

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఆర్ జిల్లా రంపచోడవరం మండలం లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు రాత్రి కాపలాదారుపై మద్యం తాగి వచ్చిన వ్యక్తి దుర్భాషలాడుతూ ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయటానికి ప్రయత్నించడాన్ని జిల్లా నర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు గంగాభవానీ ఖండించారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పాడేరు జిల్లా వైద్యాధికారిని కోరారు. నిందితుడిపై చర్యలు తీసుకొనే వరకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

విజ్ఞానంతో చేసే పండుగ దీపావళి

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానంతో చేసే పండుగ దీపావళి అని బ్రహ్మకుమారి రామేశ్వరి అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జీవితంలో అంధకారం తొలగించే దీపావళి కార్తీకమాస ఆరంభానికి శుభ సూచకమన్నారు. సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, నాగరాజు పట్నాయక్, సూరిబాబు, సిద్ధు, సునీత పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంచరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో ఆఖరి సెమిస్టర్ చదువుచున్న పదిమంది విద్యార్థులు 'ది ఆంధ్ర పెట్రోకెమికల్స్ లిమిటెడ్- విశాఖ' సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో వీరు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారికి బుధవారం కంపెనీ ప్రతినిధుల సమక్షంలో నియామక పత్రాలు అందజేశారు. కెమికల్ బ్రాంచి నుంచి ఐదుగురు, పెట్రో కెమికల్స్. ఆయిల్ టెక్నాలజీ, ప్లాస్టిక్&పాలిమర్స్ విభాగం నుంచి ఎంపికయ్యారు.వీరికి మొదటి ఏడాది రూ.2 లక్షలు, రెండో ఏడాది నుంచి రూ.4.8 లక్షల వేతనం ఇస్తారు. ఉద్యోగాలు పొందినవారిలో వి.జ్ఞానేశ్వరి, ఎం.దినేష్ కుమార్, కె.వెంకట త్రిలోచన,పి.భవానీశంకర్, డి.రవితేజ, ఎస్.భాగ్యకిరణ్, రాఘవేంద్ర, ఎం.లక్ష్మీప్రసాద్, ఎ.తేజ, కె.బాలాజీ ఉన్నారు. వీరిని ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు డా.బీవీ లక్ష్మణరావు, సీహెచ్.జయప్రకాశ్ రెడ్డి, దామోదర్, డా.ప్రశాంత కుమారి, సీహెచ్.వినోద్ కుమార్ తదితరులు అభినందించారు.

ఉత్సవ కమిటీ ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని 26వ వార్డు కూటమి అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, నాగడమూడి నానాజీ, బండి కనకరాజులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును బుధవారం వినతిపత్రంలో అభ్యర్థించారు. ఉత్సవ కమిటీ సభ్యుల వివరాలు అందజేశారు. రాబోయే రోజుల్లో దేవస్థానం కమిటీలో వీరే ఉండే విధంగా ప్రతిపాదించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సీతంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తనను పట్టించుకోవడం లేదంటూ మనోవేదన చెందిన మహిళ ఓ వృద్ధుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాటిచెట్లపాలెం చిన్నూరుకు చెందిన సుధాకర్ గుప్త (72), అక్కయ్యపాలెం రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక రోడ్డులో ఉన్న ఓ మహిళ (60) మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. ఆమె తీవ్రమైన వ్యాధికి చికిత్స పొందింది. ఈ సమయంలో సుధాకర్ గుప్త తనను పట్టించుకోవడంలేదని కక్షకట్టింది. పథకం ప్రకారం నీళ్ల సీసాలో పెట్రోలుతో వచ్చి సీతంపేట కూడలిలో కనిపించిన సుధాకర్‌తో మాట్లాడుతూ అతని తలపై పెట్రోలు పోసి నిప్పంటించింది. అతను తీవ్రంగా గాయపడడంతో ద్వారకా పోలీసులు కేజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్వారకా పోలీసులు పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. తొలుత హత్యాయత్నం కేసు నమోదు చేయగా ఇప్పుడు హత్యగా మార్చారు.

టపాసులు కాదు..మిఠాయిలే!

» వినూత్నంగా తయారు చేయించిన దుకాణదారులు, » డ్రై ఫ్రూట్స్, చాక్లెట్ గిఫ్ట్ ప్యాక్‌లకు డిమాండ్, ధరలు పైపైకి



దీపావళి టపాసుల ఆకారంలో తయారు చేసిన మిఠాయిలు



చూడగానే నోరూరించే వైవిధ్యమైన స్వీట్లు



చిచ్చుబుడ్ల రూపంలో స్వీట్లు

డాబాగార్డెన్స్, జగదాంబ కూడలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ అంటే ఠక్కున గుర్తొచ్చేవి టపాసులు... వాటికి జోడీగా మిఠాయిలు.. ప్రమిదలు,..అలంకరణలు.. వీటితోనే ప్రతి ఇంటా ఆనందం. నగరంలోని మార్కెట్లను పరిశీలిస్తే ఈ ఏడాది వైవిధ్యమైన రీతిలో మిఠాయిలు విక్రయించడం కనిపించింది. అన్ని వర్గాలవారు కొనుగోలు చేసి ఆనందం పంచుకునేలా విక్రయించాలన్న లక్ష్యంతో కొందరు అందుబాటు ధరల్లో వీటిని విక్రయిస్తున్నారు. అయితే మిఠాయి దుకాణం వద్దకు వెళ్లిన కొనుగోలుదారులు వాటిని చూసి అవాక్కవుతున్నారు. బాణసంచాను పోలిన మిఠాయిలు తయారు చేయడం కొనుగోలుదారుల్లో ఆసక్తి రేపింది. పూర్ణామార్కెట్, టర్నర్ చౌల్ట్రీ తదితర ప్రాంతాల్లో మిఠాయి దుకాణాలు బుధవారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. నేతి మిఠాయిల అమ్మకం జోరుగా సాగింది. మిఠాయిలు కిలో రూ.600 నుంచి రూ.800 వరకు ధర పలకగా, సాధారణంగా లక్ష్మీ పూజలో వినియోగించే అన్ని రకాల స్వీట్స్ ధర రూ. 500 వరకు ఉంది. స్పెషల్ గిఫ్ట్ ప్యాక్‌ల ధర రూ.300 నుంచి రూ.2 వేల వరకు ఉన్నాయి. బర్ఫీ కోవా..మినీబాక్స్.దీపావళి క్రేకర్స్ బాక్స్. డ్రై ఫూట్స్ స్వీట్స్ వంటివి ఆకట్టుకుంటున్నాయి. వీటి తయారీ విధానం కూడా వైవిధ్యంగా ఉంది. మార్కెట్‌లోని..పావు కేజీ రూ.170 నుంచి కేజీ రూ.1800 వరకు ఆయా వివిధ రకాల స్వీట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులోని చాకెట్స్ బాక్సు రూ.320..దీవాళి..హేంపర్ రూ.500 తదితర బాక్సులు వాటికి తగ్గట్టుగా ప్యాకింగ్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు. మిఠాయిల్లో డ్రైఫూట్స్‌ను కూడా మిళితం చేసి విక్రయాలు సాగించారు.

వినూత్నంగా అందించాలన్నదే లక్ష్యం

వినూత్నంగా స్వీట్స్‌ను అందించాలన్న ఉద్దేశంతో తాము ఈ సంవత్సరం టపాసుల మాదిరిగా స్వీట్స్‌ను తయారు చేయించడం జరిగింది. నేటి నుంచి స్వీట్స్‌విక్రయాలు మొదలవుతున్నాయి. వెయ్యి కేజీల నుంచి 2000 కేజీల వరకు వెళ్తాయన్న అంచనాతో ఉన్నాం. స్వీట్స్‌తో పాటు వివిధ రకాలైన స్వీట్స్‌ను మధుమేహ బాధితులు తినేలా అందజేస్తున్నాం. నాణ్యత, వైవిధ్యంతో ప్రజలకు అందజేయాలన్నదే తమ లక్ష్యం.

-విజయకుమార్‌రాజు, శర్వాణీ స్వీట్స్

టీడీపీ సభ్యత్వాల జోరు పెంచండి: ఎంపీ



జిల్లా పార్టీ కార్యాలయంలో నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వాలు చేయాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించి పార్టీని బలోపేతం చేయటానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, నాయకులు మహ్మద్ నజీర్, లొడగల కృష్ణ, పొలమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం శ్రమిస్తే గుర్తింపు

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల నమోదును వేగవంతం చేయాలని 45వ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వార్డు కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కావాలంటే సభ్యత్వాలను ఎక్కువగా చేయించాలని చెప్పారు. పార్టీ కోసం పాటుపడిన వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, పలిశెట్టి అప్పన్న, షేక్‌బాబ్జి పాల్గొన్నారు.



అక్కయ్యపాలెంలో టీడీపీ నాయకులతో సమావేశమైన భరణికాన రాజు

మందుగుండు సామగ్రి స్వాధీనం



మందుగుండు సామగ్రి విక్రయిస్తున్న దుకాణం

జగదాంబ కూడలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి అక్రమ నిల్వల వ్యవహారం పూర్ణామార్కెట్‌లో కలకలం రేపింది. ఎటువంటి లైసెన్స్‌లు తీసుకోకుండా జనావాసాల మధ్య రహస్యంగా మందుగుండు సామగ్రిని నిల్వచేసిన విషయం బుధవారం మధ్యాహ్నం వన్‌టౌన్ పోలీసుల దాడుల్లో వెలుగుచూసింది. గత వారం పూర్ణామార్కెట్ ఏరియాలోని పండా వీధిలో ఒక ఇంటిలో బాణసంచా నిల్వలను పోలీసులు పట్టుకున్నారు. రద్దీగా ఉండే వ్యాపార కూడలిలో తాళ్ళు, చీపుళ్ళు, చేతి సంచులు అమ్ముతున్న దుకాణంలో అక్రమంగా నిల్వలు బయటపడడంతో మిగిలిన వ్యాపార వర్గాలు ఉలిక్కిపడ్డాయి. ఈ దుకాణదారుడి నుంచి రూ. 4 లక్షల విలువైన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. బాణసంచాను, విక్రయిస్తున్న మహిళలను పోలీసులు ఆటోలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఓ పూల వ్యాపారి రహస్యంగా రూ.30 లక్షల విలువ చేసే మందుగుండు సామగ్రిని నిల్వ చేసినట్లు ఓ మహిళ పోలీసులకు చెప్పడంతో అక్కడ ఘర్షణకు దిగారు.

మార్గశిర మాసోత్సవాలపై చర్చ

పూర్ణామార్కెట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు డిసెంబరు 2 నుంచి 30 వరకు నిర్వహించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో ఈవో కె.శోభారాణి బుధవారం ఆలయంలో చర్చించారు. భక్తుల దర్శనం అనంతరం వెలుపలికి వచ్చే మార్గాన్ని పరిశీలించారు. కొత్తరోడ్డు నుంచి ముఖద్వారం వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, గురువారాల్లో కల్పిస్తున్న వసతులను అధికారులు వివరించారు. ఇంజనీరు రమణ, అధికారులు, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆసుపత్రికి వృద్ధురాలి తరలింపు

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో జడ్జి క్వార్టర్స్ రోడ్డుపై జీవచ్ఛవంలా పడి ఉన్న నాయికుల గోవిందమ్మ (80)ను వైద్యం కోసం ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు విమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ ఆదేశాల మేరకు ఆసుపత్రిలో చేర్పించామని వాసు తెలిపారు. ఆమెకు వైద్య పరీక్షలు చేయగా డెంగ్యూ అని తేలింది. ఆ వృద్ధురాలు శివాజీపాలెం, బలరామ్‌నగర్‌లో కూతురు దుర్గ (61), కుమారుడు సింహాచలం (59)తో కలిసి ఉంటోంది.

ఎమ్మెల్యే దృష్టికి మేదరవీధి సమస్యలు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పూర్ణామార్కెట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పూర్ణామార్కెట్ మేదరవీధిలో సమస్యలు పరిష్కరించాలంటూ యువజన సంఘం ప్రతినిధులు వరసిద్ధి వినాయక వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్ నేతృత్వంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. బుధవారం 35వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. మంచినీటి సరఫరాలో ఇబ్బందులు, యూజీడీ కాలువల సమస్య, నిత్యం విద్యుత్ సరఫరాలో అవాంతరాలను ఆయన దృష్టికి తెచ్చారు. పూర్ణామార్కెట్ ఆధునికీకరణ అంశాన్ని, ట్రాఫిక్ నియంత్రణ ఆవశ్యకతను పలువురు ప్రస్తావించారు. గణేశ్ పాఠశాల పక్కన 650 గజాల స్థలంలో సామాజిక భవన నిర్మాణం చేపట్టాలని, రెడ్డి సామాజికవర్గానికి అంజనేయస్వామి గుడిపక్కన ఖాళీ స్థలంలో భవనం నిర్మించాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. లక్ష్మీనగర్ హౌసింగ్ స్కీములో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అక్కడ నివాసితులు కోరారు. జనతాబజార్‌ను పునర్నిర్మాణం, కాయగూరల మార్కెట్ వద్ద గణేశ్ ఆలయం ఆధునికీకరణ, పెరిగివీధి, రామాలయం సందులో సీసీ కెమేరాల ఏర్పాటు వంటి అంశాలను స్థానికులు ప్రస్తావించారు. కొత్త రోడ్డు డంపింగ్ యార్డ్ వల్ల ఇబ్బందులను వివరించారు. యార్డ్‌ను తరలించాలంటూ స్థానిక నాయకులు సూచించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

గ్రూప్-2 పరీక్ష తేదీ ప్రకటనపై హర్షం

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 5న నిర్వహిస్తామన్న ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ ప్రకటనపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో గ్రూప్-1 మళ్లీ ప్రకటించి, మెయిన్స్ నిర్వహించాలని కోరారు.

'సినిమా విజయంతో ఆనందంగా ఉంది'



సమావేశంలో 'ఎంత పని చేశావ్' చిత్ర బృందం

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంత పని చేశావ్ చిత్రం పెద్ద సక్సెస్‌ను అందుకోవడం ఆనందంగా ఉందని కథానాయకుడు శ్రీనివాస్ ఉలిశెట్టి అన్నారు. బుధవారం వెంకటేశ్వర థియేటర్‌లో చిత్ర విజయోత్సవం నిర్వహించారు హీరోగా తన మొదటి చిత్రం అయినప్పటికీ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, లబ్దే సోదరులకు, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ నిహారిక కేశవ్, పటాన్ జిలాన్ కాన్, చిత్ర బృందం పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ విచారణ జరపాలి: స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

పాల సేకరణ ధర తగ్గింపుతో మూడు లక్షల మంది రైతులకు నష్టం

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో 7.95 ఎకరాల భూమిని విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించినట్టు వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 7.95 ఎకరాలను విశాఖ డెయిరీ అక్రమించుకున్నట్టు పీతల మూర్తియాదవ్ చేసిన ఆరోపణపై కలెక్టర్ విచారణ చేయాలన్నారు. పూర్వం శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకు పాడి రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం విశాఖ డెయిరీ స్థాపించారని, ఇప్పుడు కమర్షియల్‌గా మారిపోయి రైతుల సంక్షేమాన్ని పక్కన పెట్టారని విమర్శించారు. డెయిరీ స్వలాభం కోసం ఆవు పాల సేకరణ ధర లీటరుకు రూ.3 తగ్గించడంతో మూడు లక్షల మంది రైతులు నష్టపోనున్నారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెం నాయుడు విశాఖ డెయిరీపై విచారణ చేయించి, వాస్తవమని తేలితే చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి అన్ని పార్టీలు రైతులు పక్షాన పోరాడాలని అయ్యన్న పిలుపునిచ్చారు.

కిక్కిరిసిన సీతమ్మధార రైతుబజార్



పిచ్చుక గూడు రూపంలో ప్రమిదలు

సీతమ్మధార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా సీతమ్మధార రైతుబజార్ కొనుగోలుదారులతో బుధవారం కిక్కిరిసింది. పెద్ద సంఖ్యలో జనం కూరగాయాలు కొనుగోలు చేయడంతో పాటు దీపావళి పూజకు కావలసిన సామాగ్రి కొనుగోలు చేశారు. పూల ధరలు అమాంతం పెంచేశారని కొనుగోలుదారులు వాపోయారు. సాయంత్రం కూడా బజారుకు అధిక సంఖ్యలో రావడంతో రద్దీగా కనిపించింది. సంప్రదాయాల్లో భాగంగా ఆముదం కర్ర కొనుగోలుకు ఆసక్తి చూపించారు. వీటిని కూడా గ్రామీణులు విక్రయానికి ఎక్కువగా తీసుకొచ్చారు. రైతుబజార్ బయట తోపుడు బండ్లపై విక్రయించిన మట్టి ప్రమిదలు అమితంగా ఆకట్టుకున్నాయి. లక్ష్మీదేవి రూపంతో ఉన్న దీపం ప్రమిదలు, పిచుక గుడులో ఉన్నవి, మంచినీటితో వెలిగించే ప్రమిదలను ఎక్కువగా కొనుగోలు చేశారు. కొనుగోలుదారులు తమ వాహనాలను బజార్ బయట చిరు వ్యాపారుల తోపుడు బండ్ల ముందు పెట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పార్కింగ్ స్థలంలో కాకుండా బజార్ బయటే అడ్డదిడ్డంగా పెట్టడంతో పాదచారులు, ఇతరులు ఇబ్బంది పడ్డారు.

చంద్రబాబు స్త్రీ పక్షపాతి: గండిబాబ్జీ



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెలుగు మహిళలు

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తున్న చంద్రబాబు నాయుడు స్త్రీ పక్షపాతి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. గతంలో దీపం పథకం, నేడు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించి మధ్యతరగతి మహిళలకు ఊరట కలిగిస్తున్నారని, సూపర్ సిక్స్ పథకాల్లో మొదటిగా దీపావళి కానుక అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, రాగిన అనంతలక్ష్మి, వేణు, పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

భర్త, అత్తమామలతో పాటు తోటికోడలు, బావ అరెస్టు



చిన్ని దివ్యశ్రీ మృతదేహం

కూర్మన్నపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని పెదజాలరిపేట ప్రియదర్శిని కాలనీకి చెందిన చిన్ని దివ్యశ్రీ (19)కు 88వ వార్డు పరిధి మంగళపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన చిన్ని శరత్‌కుమార్‌తో గత ఏడాది మార్చి 18న వివాహమైంది. అప్పటినుంచి దివ్యశ్రీకి అదనపు కట్నం కోసం వేధింపులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో అత్త సత్య, మావయ్య అప్పారావు, భర్త శరత్‌కుమార్‌లు నిత్యం తనను వేధిస్తున్నారంటూ ఆమె తల్లిదండ్రులకు చెప్పుకుని బాధపడేది. కాగా దివ్యశ్రీకి జూన్‌లో కుమారుడు పుట్టాక, మూడు నెలల తర్వాత అత్తింటికి వెళ్లింది. ఇంటి కోసం తోటి కోడలు లక్ష్మి, బావగా వేణు గొడవలు పడుతుండేవారని, వారిద్దరితో పాటు అత్తమామలు, భర్త ఏకమై తనను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు కన్నవారికి దివ్యశ్రీ పలుమార్లు చెప్పింది. ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలప్పుడు దివ్యశ్రీ తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంట్లో వారందరూ తనతో గొడవ పడుతున్నారనీ, తనను ఏమి చేస్తారోనని, ఇక బతకనని చెప్పి ఫోన్ కట్ చేసింది. తిరిగి వారు ఎవరికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అయితే అదేరోజు మధ్యాహ్నం మూడున్నరప్పుడు అత్త సత్య ఫోన్ చేసి దివ్యశ్రీ మృతి చెందిందని చెప్పడంతో దివ్యశ్రీ తల్లిదండ్రులు పీతల సూర్యలక్ష్మి, ఈశ్వరరావు మంగళపాలెం చేరుకున్నారు. అత్తింటి వారి వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులకు సూర్యలక్ష్మి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దివ్యశ్రీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వేధింపులకు తాళలేకే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని దివ్యశ్రీ ఆత్మహత్య చేసుకున్నట్టు నిర్ధారించిన పోలీసులు భర్తతో పాటు అత్తమామలు, తోటికోడలు, బావలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు

'బీసీల అభ్యున్నతికి కృషి చేస్తా'



జిల్లా బీసీల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న విల్లూరి చక్రవర్తి

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ కులాల సమైక్య సంక్షేమ సంఘం విశాఖ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విల్లూరి చక్రవర్తి తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు సారథ్యంలో జిల్లా అధ్యక్షుడు రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశాఖ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తనకు నియామక పత్రాన్ని అందజేశారన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన ఎమ్మెల్సీ రామారావు, రవి, వి.నూక రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాత సంత స్థలాన్ని పరిశీలించిన అధికారులు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ స్వాధీనంలో ఉన్న అక్కిరెడ్డిపాలెంలోని పాత సంత స్థలంపై జిల్లా కలెక్టర్‌కు స్థానికులు పలువురు చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడి సర్వే నంబర్-47/3లో ఉన్న సుమారు మూడెకరాల స్థలాన్ని విశాఖ డెయిరీ యాజమాన్యం స్వాధీనం చేసుకోవడంతో ఇక్కడ నిర్వహించే సంతను సుమారు 30 ఏళ్ల వేరే చోటకు తరలించారు. అయితే ప్రభుత్వానికి చెందిన ఈ స్థలం ప్రస్తుతం ఖాళీగా ఉన్నందున అభివృద్ధి పనులకు కేటాయించాలని స్థానికులతో పాటు సీపీఎం గాజువాక డివిజన్ నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు గాజువాక మండల సర్వేయర్ టి.రామారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేశ్, వీఆర్వో రావి ఆనంద్‌తో పాటు సచివాలయ సిబ్బంది ఈ స్థలాన్ని పరిశీలించారు. స్థానిక నాయకులు అంగ లోకేశ్, వరదాడ రమణ, ఎం.రాంబాబు తదితరులు అధికారులకు సంత స్థలం వివరాలను తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను రెండు రోజుల్లో ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేయాలని 'పల్లా'కు వినతి

ఆటోనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేయాలని కోరుతూ ఏపీ వీవర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, టీడీపీ నాయకుడు పప్పు రాజారావు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. 2024-25లో ఏపీలో పది చేనేత క్లస్టర్లుకు కేంద్రం ప్రతిపాదనలను పంపిన నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాటిని ఏర్పాటు చేసి చేనేతకు చేయూతనివ్వాలని వేడుకున్నారు. ఆయా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూర్మన్నపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, మంగళపాలెంలో బుధవారం రూ.రెండు కోట్ల 93 లక్షలతో కాలువలు, కమ్యూనిటీ హాళ్లు, బీటీ రోడ్లకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు యు.శ్రీనివాసరావు, జి.సన్యాసిరావు, ఎం.రాము, పైడిరాజు, ఒమ్మి రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

అగనంపూడి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదల పార్టీగా పేరొందిన టీడీపీ సభ్యత్వం ఉంటే ఎంతో గర్వకారణంగా ఉంటుందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. అగనంపూడిలో బుధవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పార్టీలో కష్టపడిన వారికి ఎప్పుడూ మంచి గుర్తింపుతో పాటు అండగా ఉంటుందన్నారు. నాయకులు గల్లా రాజు, కరణం పైడిరాజు, జగదీశ్, మాడిశ వెంకటరావు, సత్యారావు, ఎస్.సింహాచలం, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వీనమ్ :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **పొట్టేల్ :** వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎంతపనిచేసావ్ చంటి :** వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **లగ్గం :** విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **దేవర :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **వేట్టయాన్ :** సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **విశ్వం :** శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 44, టమాటా 38, వంకాయలు(తెలుపు) 36, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 42, పచ్చిమిర్చి 44 కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 34, క్యారెట్ 60 దొండకాయలు 42, బంగాళ దుంపలు 32, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)60, బరబటి 44, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 46, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 48, కీర దోస 28, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 34, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226



దీపావళి వెలుగులు లేవాయె..

» ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కారికులకు అందని జీతాలు

» నాలుగు నెలలుగా వేతనాలు లేక మరీ దయనీయంగా మారిన కార్మికుల బతుకులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారం ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల మోముల్లో ఈ ఏడాది దీపావళి వెలుగులు కానరావడం లేదు. స్టీల్‌ప్లాంటులో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా గత కొన్ని నెలలుగా ఉద్యోగులకు రెండు వాయిదాల్లో ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబరుకు సంబంధించి ఈ నెలలో రెండు వాయిదాల్లో ఉక్కు ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతాన్ని పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. ఈ నెల 20వ తేదీ వచ్చేసరికి మొదటి వాయిదా కింద సగం జీతాన్ని చెల్లించి మమా అనిపించారు. ఇప్పుడు నెలాఖరు వచ్చేసినా.. దీపావళి పండగ ఉన్నప్పటికీ మిగతా సగం జీతాన్ని మాత్రం చెల్లించలేదు. జీతాల విషయంలో ఉక్కు యాజమన్యాన్ని అడిగినా సరైన సమాధానం ఇవ్వడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు సకాలంలో పూర్తి స్థాయిలో అందకపోవడంతో ఈ నెలలో దసరాను సరిగ్గా జరుపుకోలేకపోయామని, ఇప్పుడు దీపావళి పండగను కుటుంబాలతో ఆనందంగా చేసుకోలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

కాగా కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. స్టీల్‌ప్లాంటులోని కొన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు నాలుగైదు నెలలుగా జీతాలు అందడం లేదు. దీంతో అప్పులు చేసుకుని కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. దీపావళి పండగ దృష్ట్యా అయినా కనీసం కొంతమేర జీతాలు చెల్లించాలని వారు కోరినా ఫలిలం లేకుండా పోయింది. దివ్వెల పండగ నాడు కూడా తమ జీవితాల్లో.. ముంగిళ్లలో కాంతులు లేకుండా పోయాయని పలువురు కాంట్రాక్టు కార్మికులు విచారవదనంతో చెబుతున్నారు.

కళ తప్పిన గాజువాక మార్కెట్

గాజువాక: దీపావళి పండగ వచ్చిందంటే చాలు గాజువాక మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడేది. అలాంటిది ఈ ఏడాది గాజువాక మార్కెట్ కళ తప్పింది. కిక్కిరిసిపోయి ఉండే మార్కెట్‌లో ఇప్పుడు కొనుగోలుదారులు ఎవరూ వస్తారా అని వ్యాపారులు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ప్రమిదలు, కొవ్వొత్తులు, పలు రకాల పూజా సామగ్రిని ఇక్కడకు తెచ్చి విక్రయిస్తుంటారు. అయితే గతంలో కన్నా ఈసారి ఆశించిన మేర వ్యాపారం జరగలేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు గాజువాక పరిసర ప్రాంతంలోనే ఎక్కువగా నివసిస్తున్నారు. ప్లాంటులో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా వారికి జీతాలు సరిగ్గా అందకపోవడంతో ఆ ప్రభావం గాజువాక మార్కెట్‌పై పడిందని చెప్పవచ్చు.



కొనుగోలుదారుల కోసం ప్రమిదల అమ్మకందారుల ఎదురుచూపులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఐలా ప్రతినిధులు

ఆటోనగర్,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవని ఐలా కమిషనర్ కిశోర్, చైర్మన్ రఘు అన్నారు. ఆటోనగర్ డీ-బ్లాక్‌లో బుధవారం మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ), విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సహకారంతో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ ఎన్.శేషగిరిరావులు మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు గన్న పరిశుభ్రమైన, సుందర భారత దేశం కోసం అందరం అహర్నిశలు కృషి చేస్తామని ఎంఎస్‌ఎంఈ, ఏపీఐఐసీ, ఐలా, వాసీవా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ కో-ఆర్డినేటర్ చంద్రమౌళి, ప్రభాకర్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసర ప్రాంతాలను చీపుర్లతో శుభ్రం చేశారు. ఐలా మాజీ చైర్మన్ యార్లగడ్డ సాంబశివరావు, వాసీవా మాజీ అధ్యక్షుడు ఏకే బాలాజీలతో కాలుష్య నివారణకు మొక్కలు నాటించారు. అనంతరం పలువురికి మాస్కులు, సబ్బులు, టోపీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, వాసీవా, ఐలా ప్రతినిధులు రాంప్రసాద్, కొల్లి సత్యనారాయణ, ఈ.కృష్ణప్రసాద్, చీకటి సత్యనారాయణ, అల్లూరు రాజు, నాగిరెడ్డి, వేమూరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐలా కమిషనర్ కిశోర్

కార్మిక సంక్షేమాన్ని మరిచిన ఉక్కు యాజమాన్యం

గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమాన్ని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మరిచిందని గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ అన్నారు. కార్మికులకు జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం గేటు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మిక వర్గానికి అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు మాట్లాడుతూ సంస్థ అన్ని విధాలా ప్రగతిపథంలో పయనిస్తుందని యాజమాన్యం చెబుతున్నా, కార్మికులకు మాత్రం అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి

స్టీల్‌ప్లాంటుకు అన్ని విధాల ప్రోత్సాహం అందించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించడంతో పాటు ఆర్థికంగా చేయూతనందించాలని, నిలిపివేసిన బోనస్ ఇవ్వాలని కోరారు. సెయిల్‌లో స్టీల్‌ప్లాంటును విలీనం చేస్తే అన్ని విధాలా ప్రగతి సాధిస్తుందన్నారు. నాయకులు నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం భవిష్యత్తులో చేపట్టనున్న పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ ప్లాంట్ ప్రగతి అంటున్నారని, అయితే ఉక్కు ప్రైవేటీకరణ అంశం తెరపై ఉందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో ఏదో కుట్ర జరుగుతుందన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం సుమారు 1,400 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. అందువల్ల భారీ ఎత్తున ఉద్యమాలకు ఉద్యోగులు, కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ఎస్‌ఏ నాయుడు, ప్రభాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లకు దీపావళి కళ



బంక్ కూడలిలో బాణసంచా దుకాణాలు

గోపాలపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా గోపాలపట్నం రైతుబజారు కొనుగోలుదారులతో బుధవారం కిటకిటలాడింది. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు బజారులకు చేరడంతో బజారులు కిక్కిరిసిపోయాయి. పూజాసామగ్రి, కూరగాయలు కొనుగోలు చేయడానికి వచ్చిన కొనుగోలుదారులతో రైతుబజారు రద్దీగా కనిపించింది. అలాగే బంక్ కూడలిలోని బుధవారం సంత ప్రాంగణం కూడా కిటకిటలాడింది. దీపావళిని పురస్కరించుకొని గృహోపకరాణలు విక్రయించే దుకాణదారులు వివిధ ఆఫర్లతో కొనుగోలుదారుల్ని ఆకర్షించారు. సెల్‌ఫోన్ దుకాణాలు రద్దీగా కనిపించాయి.

మందకొడిగా బాణసంచా విక్రయాలు

గోపాలపట్నం కేంద్రంగా బంక్ కూడలిలో ఈ ఏడాది 31 బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి విక్రయాలు ప్రారంభించినా ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగడం లేదని వర్తకులు వాపోతున్నారు. బుధవారం కూడా కొనుగోలుదారులు లేక బాణసంచా విక్రయాలు మందకొడిగా సాగాయి.

బాణసంచా విక్రయాలకు బ్రేక్

» ఫైరింజన్లు ఏర్పాటు చేయలేదంటూ అధికారులు అభ్యంతరం



గేటువద్ద వేచి ఉన్న కొనుగోలుదారులు

మల్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని ఏపీఐఐసీ స్థలంలో బాణసంచా అమ్మకాలకు సడన్‌గా బ్రేక్ పడింది. వ్యాపారులు నిబంధనలన్నీ పాటించినప్పటికీ ఇక్కడ ఫైరింజన్లు ఏర్పాటు చేయలేదన్న కారణంతో అధికారులు బాణసంచా విక్రయాల మైదానం గేటును మూసేశారు. దీంతో బాణసంచా కొనుగోలుకు వచ్చిన జనాలు ఆ గేటు వద్ద నిలబడిపోయారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. సాధారణంగా ప్రమాదాల నివారణకు సంబంధించి ప్రతి దుకాణం ముందు డ్రమ్‌తో నీళ్లు, ఇసుకను ఏర్పాటు చేస్తే సరిపోతుంది. కానీ ఇక్కడ పక్కనే నేవీకి చెందిన ఏకోశ కార్యాలయం ఉండడంతో తప్పనిసరిగా ఫైరింజన్లు ఏర్పాటు చేయాలని బాణసంచా వ్యాపారులకు అధికారులు ఆలస్యంగా చెప్పడంతో వ్యాపారులు ఖంగుతిన్నారు. అసలే ఈ ఏడాది అమ్మకాలు ఆశాజనకంగా లేవన్న బాధలో ఉండగా, ఇలా అమ్మకాలను బ్రేక్ వేయడం ఏమిటంటూ వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

విద్యుత్ చార్జీల భారంపై సీపీఐ నిరసన



ఆర్ఆర్వీపురంలో సీపీఐ నేతలు, కార్యకర్తలు ఆందోళన

వేపగుంట అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వెంటనే విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విరమించుకోవాలని ఆర్ఆర్వీ పురం విద్యుత్తు కార్యాలయం వద్ద సీపీఐ ఆందోళన చేపట్టింది. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.6072 కోట్ల భారం సామన్య ప్రజలపై రుద్దేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఏడీఈ ఆర్.రామునాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు వై.రాంబాబు, నాయకులు అసిరి నాయుడు, అరుణ, శ్రీరామ్,రమణ, అనురాధ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో..

మల్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : విద్యుత్ సర్దుబాటు చార్జీలు ప్రజలపై రుద్దకూడదని కోరుతూ మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. వెంటనే ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పశ్చిమ నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి సత్యాంజనేయ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, గండి అప్పారావు, త్రినాథ్, కామేశ్వరరావు, శ్రీనివాసరావు, కనకేశ్వరరావు,బి.వెంకట్, డి.గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్టీఎల్‌లో రాష్ట్రీయ ఏక్తా దివాస్




రన్ ఆఫ్ యూనిటీలో పాల్గొన్న ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్, ఉద్యోగులు

గోపాలపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రథమ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఎన్ఎస్టీఎల్‌లో బుధవారం రాష్ట్రీయ ఏక్తా దివాస్ వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్టీఎల్ రెసిడెన్షియల్ క్యాంపస్‌లో ఎన్ఎస్టీఎల్ ఉద్యోగులు నిర్వహించిన రన్ ఆఫ్ యూనిటీ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్‌తో పాటు సుమారు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఉద్యోగులు నివాళులర్పించి రాష్ట్రీయ ఎక్తా దివాస్ ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎస్ దాస్, ఎన్ఎస్టీఎల్ శాస్త్రవేత్తలు, వర్క్స్ కమిటీ, సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే మా ధ్యేయం

షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ

మల్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : షిప్‌యార్డు కాలనీలో సీ అండ్ డీ క్వార్టర్స్‌లలో నిర్మించిన 22 ఇళ్లను సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులకు మేలు జరిగే విధంగా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కాలనీలో వాసుల కోసం కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో షిప్‌యార్డు అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న షిప్‌యార్డు సీఎండీ

శారదాపీఠం ఆధ్వర్యంలో కాశీలో కార్తీకం

పెందుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శారదాపీఠం ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా కాశీ మహా పుణ్యక్షేత్రంలో కాశీలో కార్తీకం ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పీఠం ఉత్తరాపీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పీఠం శ్రీకార్యం విడుదల చేసిన ప్రకటనలో కాశీలో ఉన్న పీఠం శాఖలో స్వాత్మానందేంద్ర ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో సందేశాన్ని వివరించారు. నవంబరు 3, 4, 5 తేదీల్లో కాశీలో మహారుద్రసహిత శత చండీయాగం, రామేశ్వరీ సైకత లింగ భస్మాభిషేకం, శివపార్వతిల కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ఎన్ఏడీ జంక్షన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్.బ్లాక్ కొండవాలు పరిసర ప్రాంతాల్లో రూ.70 లక్షలతో నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్డు, తారు రోడ్డు, కాలువల పనులను కార్పొరేటర్ బొమ్మిడి రమణ, ఈఈ చిరంజీవితో కలిసి బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, వి.సత్యనారాయణ, వెంకటేశ్వరావు, పి.రాము, కరుణాకర్, సత్యవేణి, శ్రీను పట్నాయిక్, ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ నాగమల్లి ఫీడర్ నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు గిరిప్రసాద్‌నగర్ 1, 2,సీ1 సీ2 జోన్, వెంకటాద్రినగర్, టీచర్స్ లే అవుట్, నాగమల్లినగర్, కార్మికనగర్, గోపాలకృష్ణ నగర్,ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యావరణంపై ఆళ్వార్స్ విద్యార్థుల అవగాహన ర్యాలీ

వేపగుంట, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరి బాధ్యత అంటూ ఆర్ఆర్వీ పురం ఆళ్వార్స్ క్యాంపస్ విద్యార్థులు గోపాలపట్నం పెట్రోల్ బంకు నుంచి వేపగుంట కూడలివరకు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎస్ఎన్ భగవాన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచటం, కాలుష్య నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అన్నారు. ఇది అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్స్ బి.హేమచంద్రరావు, సీహెచ్ రాజు, పి.సత్య, యు.గోపి, విజయ్, ఎన్ఎస్ ఎస్ కో-ఆర్డినేటర్ జి.వినయ్, ఎస్కే వల్లి, కె.లావణ్య పాల్గొన్నారు.

చురుగ్గా వంతెన నిర్మాణ పనులు

పెదగంట్యాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి డెయిరీ కాలనీలో గెడ్డపై ఉన్న ప్రధాన వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నలభై లక్షల రూపాయల అంచనా వ్యయంతో దీనిని నిర్మిస్తున్నారు. ఇక్కడ ఉన్న వంతెన పూరిగా శిథిలమవ్వడంతో దానిని తొలగించి కొత్తది నిర్మిస్తున్నారు. బుధవారం నిర్మాణ పనులను కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. నాణ్యతతో త్వరితంగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.